తీరని వేదన







వెంకయ్య, కొర్లయ్య (ఫైల్)

సరిహద్దు దాటితే.. అంతే..

గుజరాత్‌లో వీరావల్‌లోని అరేబియా సముద్రంలో చేపల వేట సాగిస్తూ.. ఈ ప్రాంత మత్స్యకారులు పొరపాటున బోర్డర్ దాటి పాక్ కోస్ట్‌గార్డులకు చిక్కిన సందర్భాలు అనేకం ఉన్నాయి. 2018 నవంబరులో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన 22 మంది మత్స్యకారులు పాక్ కోస్టుగార్డులకు బందీలుగా చిక్కారు. 14 నెలల తర్వాత బందీ నుంచి విముక్తి అయ్యారు. అంతకు ముందు ఇలాంటి సంఘటనలు ఉన్నాయి. దీంతో కొంతమంది మత్స్యకారులు కర్ణాటక రాష్ట్రానికి వలసలు ప్రారంభించారు.

● శ్రీకాకుళం మండలం పెద్దగనగళ్లవానిపేట పంచాయతీ చినగనగళ్లవానిపేటకు చెందిన దాసరి వెంకయ్య, గనగళ్ల కొర్లయ్య ఉపాధి నిమిత్తం ఈ ఏడాది జూన్ 7న తమిళనాడు ప్రాంతం నాగపట్నం వెళ్లారు. జూన్ 25న వారిద్దరితోపాటు అక్కడి మత్స్యకారులు 8 మంది.. సముద్రంలో చేపలవేట సాగించారు. ఈ క్రమంలో వారి బోటు.. భారత దేశ సముద్ర జలా లు దాటి.. శ్రీలంక సముద్ర సరిహద్దులోకి ప్రవేశించింది. దీంతో శ్రీలంక కోస్టుగార్డులు.. బోటులోని మత్స్యకారులను అదుపులోకి తీసుకుని జైల్లో పెట్టారు. ఇప్పటివరకూ మత్స్యకారులను విడుదల చేయకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. వారి ఆరోగ్యం క్షీణించిందని సమాచారం అందడంతో మరింత కలవరపడుతున్నారు. కోస్టుగార్డుల చెర నుంచి వారిని విడిపించాలని అధికారులను వేడుకుంటున్నారు. వారి రాక కోసం ఎదురు చూస్తూనే ఉన్నారు.

● మత్స్యకార గ్రామాల్లో ప్రారంభమైన వలసలు
● గుజరాత్, కర్ణాటక ప్రాంతాలకు గంగపుత్రుల పయనం
● స్థానికంగా ఉపాధి లేక తప్పని ఇబ్బందులు
● మళ్లీ ఏప్రిల్‌లోనే స్వగ్రామాలకు రాక
● అంతవరకూ కుటుంబ సభ్యులకు ఎదురుచూపే..

గుజరాత్‌లో చేపలు వేటాడుతున్న సిక్కోలు మత్స్యకారులు (ఫైల్)

(ఎచ్చెర్ల)

జిల్లాలో 193 కిలోమీటర్ల మేర సుదూర సముద్ర తీరం ఉన్నా.. చేపల వేట సక్రమంగా సాగడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్ల పూర్తయినా.. మత్స్యకారుల జీవన స్థితిగతుల్లో ఏమాత్రం మార్పు రావడం లేదు. స్థానికంగా ఉపాధి లేక చాలామంది మత్స్యకారులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఉపాధి కోసం గుజరాత్, కర్ణాటక వంటి రాష్ట్రాలకు వలస పోతున్నారు. ఏటా ఆగస్టులో వలస వెళ్లి.. ఏప్రిల్‌లో స్వగ్రామాలకు వస్తుంటారు. ప్రస్తుతం జిల్లాలో ఎచ్చెర్ల, రణస్థలం మండలాలతోపాటు పలు తీరప్రాంత గ్రామాల నుంచి మత్స్యకారులు వలసబాట పడుతున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని వీరావల్, కాండ్లా, పోరుబందర్‌తోపాటు కర్ణాటకలోని మంగుళూరుకు పయనమవుతున్నారు. సుమారు 8 నెలల పాటు కుటుంబ సభ్యులు, బంధువులకు దూరంగా ఉంటూ.. సాగరంలోనే చేపలవేట సాగిస్తూ కాలం వెల్లదీస్తారు. వేట సాగించే సమయంలో ప్రమాదకర స్థితిలో సరిహద్దు జలాలను దాటి విదేశీ కోస్టుగార్డులకు చిక్కుతున్నారు. అక్కడి జైలులో నెలల తరబడి మగ్గుతున్నారు. మరికొందరు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా.. ఓర్చుకుంటూ ఏళ్ల తరబడి జీవన పోరాటం సాగిస్తూనే ఉన్నారు. వలస వెళ్లినవారు క్షేమంగా స్వగ్రామాలకు చేరుకునే వరకూ కుటుంబ సభ్యులు ఎదురుచూస్తూనే ఉంటారు.

వలసకు కారణాలివీ..

జిల్లాలో ఇచ్ఛాపురం మండలం డొంకూరు నుంచి రణస్థలం మండలం దోనిపేట వరకూ 11 మండలాలను కలుపుతూ తీరం విస్తరించి ఉంది. తీరం వెంబడి వందలాది గ్రామాల్లో లక్షలాది మంది మత్స్యకార జనాభా ఉన్నారు. దశాబ్దాలుగా వేట సాగిస్తున్న మత్స్యకారులకు స్థానికంగా గిట్టుబాటు కావడం లేదు. జెట్టీలు, హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు, కోల్డ్‌స్టోరేజీలు ఏర్పాటు చేయకపోవడమే ఇందుకు కారణం. దీంతో ఏటా మత్స్యకారులు సుదూర ప్రాంతాలకు వలస పోతున్నారు.

● మత్స్యకారుల ఆర్థిక ఇబ్బందులే వలసలకు ప్రధాన కారణం. జిల్లాలో మత్స్యకారులు సంప్రదాయ తెప్పలతో, మోటారు బోట్లతో వేట సాగిస్తున్నారు. ఐదారుగురు జాలర్లు చేపల వేటకు వెళితే కనీస ఖర్చులు కూడా రాని పరిస్థితి. అలాగే ఆడపిల్లల పెళ్లిళ్లు చేసేందుకు డబ్బులు లేక చాలామంది అప్పుల పాలవుతున్నారు. ఇల్లు కట్టుకోవాలన్నా.. వడ్డీ వ్యాపారిని ఆశ్రయించాల్సిన పరిస్థితి. స్థానికంగా వేట సాగిస్తే.. కన్నీళ్లు, కష్టాలు కడతేరవు అని మత్స్యకారులు వాపోతున్నారు. ఈ క్రమంలో ఆర్థిక ఇబ్బందుల నుంచి గట్టెక్కేందుకు వలస బాట పడుతున్నారు. జిల్లాలో చేపల వేటకు అనుకూల పరిస్థితులు లేక వలసలు తప్పడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● తీర గ్రామాల్లో చెరువులు లేకపోవడంతో పూర్తిస్థాయిలో ఉపాధిహామీ పథకం పనులు కూడా జరగడంలేదు. దీంతో ఇటీవల కాలంలో కొంతమంది మత్స్యకారులు భవన కార్మికులుగా చెన్నై, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు.

ఇప్పుడిప్పుడే ప్రయోజనం కల్పించేలా..

మన రాష్ట్రంలో మత్స్యకారులకు శాశ్వత ప్రయోజనాలు కల్పించేలా ఇప్పుడిప్పుడే చర్యలు మొదలయ్యాయి. జిల్లాలోని సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు నిర్మాణం వేగంగా జరుగుతోంది. బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్, మంచినీళ్లపేటలో జెట్టీల నిర్మాణానికి చర్యలు చేపట్టారు. వీటి నిర్మాణాలు పూర్తయితే మత్స్యకారులకు స్థానికంగానే ఉపాధి లభించనుంది.

ఒప్పందం ప్రకారమే..

జిల్లా మత్స్యకారులు గుజరాత్ లో ఎన్నో కష్టాలు అనుభవిస్తు న్నారు. గుజరాత్‌లోని బోటు యజమానులతో ముందుగా ఒప్పందం కుదుర్చుకొని మత్స్యకారులు ఇక్కడి నుంచి బయలుదేరుతారు. బోటు డ్రైవర్ పాత్ర చాలా కీలకం. ఒక్కో బోటులో 7 నుంచి 9 మంది వరకు వేటకు వెళ్తుంటారు. ఇందులో డ్రైవర్ (గుజరాత్‌లో తండేలు అంటారు), అసిస్టెంట్ డ్రైవర్, కలాసీలు, వంట మనిషి(బండారి) ఉంటారు. సీజన్‌కు సుమారు రూ.7లక్షల వరకూ బోటు డ్రైవర్‌తో యాజమానులు ఒప్పందం కుదుర్చుకుంటారు. మత్స్యకారులు స్వగ్రామంలో బయలుదేరినప్పుడే అడ్వాన్స్ డబ్బులు చెల్లిస్తారు. స్వగ్రామాలకు వచ్చేటప్పుడు మిగిలిన డబ్బులు అందజేస్తారు. సీనియర్ డ్రైవర్‌కు నెలకు రూ.35 వేలు, అసిస్టెంట్ డ్రైవర్‌కు రూ.20 వేల వరకు ఇస్తారు. కళాసీ, వంట మనిషికి రూ.12వేల నుంచి రూ.15వేలు చొప్పున చెల్లిస్తారు. చేపల వేట ఆశించిన స్థాయిలో సాగితేనే ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లిస్తారు. లేదంటే కోత విధిస్తారు. అయినప్పటికీ చేసేదేమీలేక మత్స్యకారులు మిన్నకుండిపోతున్నారు.

స్నానానికీ ఇబ్బందే..

గుజరాత్‌లోని అరేబియా సముద్రంలో బోటుపై ఒకసారి బయలుదేరితే 20 నుంచి 25 రోజుల వరకు చేపలవేట సాగిస్తారు. బోటులో ఉన్నన్ని రోజులు స్నానం ఉండదు. దీని వల్ల చర్మవ్యాధులు సంక్రమిస్తాయి. పొరపాటున బోట్లు ఒకదానికొకటి ఢీకొని గాయాలపాలైనా, అనారోగ్యానికి గురైనా సరైన మందులు కూడా లభించవు. దీంతో మత్స్యకారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒడ్డుకు చేరిన తర్వాత కూడా ఒకటి రెండు రోజులు బోటులోనే విశ్రాంతి తీసుకోవాలి. ప్రత్యేకంగా వీరికి విశ్రాంతి గదులు ఉండవు. సముద్రంలో ఉండగా కొద్ది దూరం మాత్రమే మొబైల్ నెట్ వర్క్ ఉంటుంది. ఆ తర్వాత పూర్తిగా వైర్‌లెస్‌పై ఆధారపడాల్సిందే.

గుజరాత్‌కే ఎందుకంటే..

గుజరాత్‌లో 1050 కిలోమీటర్ల సముద్రతీరం ఉంటే.. మన రాష్ట్రంలో 978 కిలో మీటర్ల సముద్ర తీరం ఉంది. రెండు రాష్ట్రాల్లోని సముద్రతీరంలో పెద్దగా తేడా లేదు. అయినా గుజరాత్‌కు ఈ ప్రాంత మత్స్యకారులు వలసపోవడానికి కారణాలను సంబంధిత అధికారుల బృందం అధ్యయనం చేసింది. గుజరాత్‌లో చేపలవేట అనుకూలంగా ఉండేందుకు శాశ్వత ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి 20వేల నుంచి 25 వేల కిలోమీటర్లకు తీరంలో జెట్టీలు, ఫిషింగ్ ల్యాండింగ్ సెంటర్లు నిర్మించారు. ఫిషింగ్ హార్బర్లు ఏర్పాటు చేశారు. కోల్డ్‌స్టోరేజీ, హేచరీస్ తదితర వాటిని అధిక సంఖ్యలో నెలకొల్పారు. గుజరాత్‌లో మత్స్య సంపద ప్రధాన ఆదాయ వనరుగా ఉంది. చేపల వేట గిట్టుబాటు అయ్యేలా అక్కడి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుంది. దీనివల్ల మన ప్రాంత మత్స్యకారులు గుజరాత్‌కు వెళ్లేందుకు ఇష్టపడుతున్నారు.

● గుజరాత్‌లో మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట సాగిస్తున్నారు. మన ప్రాంతంలో సంప్రదాయ తెప్పలు, ఫైబర్ తెప్పలు, మోటారైజ్డ్ బోట్లతో చేపల వేట చేపడుతున్నారు. దీనివల్ల వేటకు ఎక్కువ దూరం పోయేందుకు వీలుండదు. తెల్లవారుజామున నాలుగైదు గంటల సమయంలో చేపల వేటకు వెళితే మధ్యాహ్నం ఒంటి గంట సరికి ఒడ్డుకు చేరుతారు. దీంతో పెద్దగా చేపల వేట సాగడంలేదు. మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట లాభసాటిగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

18 ఏళ్లుగా గుజరాత్‌కు వలస..



పదో తరగతి వరకూ చదువుకున్నాను. స్థానికంగా ఉపాధి లభించక.. సుమారు 18 ఏళ్లుగా గుజరాత్ రాష్ట్రానికి వలస వెళ్తున్నాను. వీరావల్‌లోని అరేబియా సముద్రంలో చేపల వేట సాగించే బోట్లలో తొలుత కళాసీగా పనిచేశాను. గత 8 ఏళ్లుగా డ్రైవర్‌గా పని చేస్తున్నాను. ఏటా ఆగస్టులో వలసవెళ్లి.. తిరిగి ఏప్రిల్‌లో స్వగ్రామానికి చేరుకుంటాం. వలసల నివారణకు చర్యలు చేపట్టాలి.

-వారది మహందాత, బడివానిపేట

హార్బర్ నిర్మిస్తేనే..



సుదూర సముద్ర తీర ప్రాంతం ఉన్న సిక్కోలులో ఒక్క జెట్టీ కూడా లేదు. గుజరాత్‌లో ప్రతి 25 కిలో మీటర్లకు ఒకటి వంతున జెట్టీని నిర్మించారు. దీంతో చేపల వేటకు అనుకూలంగా ఉంది. బుడగట్లపాలెంలో హార్బర్ నిర్మాణం పూర్తయితే.. ఈ ప్రాంతంలో కొంతవరకు వలసల నివారణ సాధ్యమవుతుంది.

-అల్లుపల్లి రాంబాబు, సర్పంచ్, బుడగట్లపాలెం

జెట్టీల నిర్మాణంతోనే..



జిల్లాలో చేపల వేటకు అనుకూలమైన సౌకర్యాలు కల్పిస్తేనే వలసల నివారణ సాధ్యం. కొన్నేళ్లపాటు గుజరాత్ రాష్ట్రానికి చేపల వేటకు వెళ్లాను. అక్కడ 2018లో అరేబియా సముద్రంలో పాక్ కోస్ట్‌గార్డులకు చిక్కిన 22 మంది మత్స్యకారుల్లో నేను కూడా ఉన్నాను. 14 నెలల పాటు పాక్ జైలులోనే ఇబ్బంది పడ్డాం. ఆ తర్వాత నుంచి గుజరాత్ వెళ్లడం మానుకున్నాం. డి.మత్స్యలేశం తీరంలో జెట్టీ నిర్మిస్తే ఈ ప్రాంత మత్స్యకారులకు వలసల సమస్య శాశ్వతంగా పరిష్కారమవుతుంది.

-గనగళ్ల రామారావు, డి.మత్స్యలేశం

శ్రీకాకుళం క్యాంపస్‌లో అన్ని బ్యాచ్‌లకు తరగతులు

● కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుకు సమస్యలు వివరిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, తదితరులు

ఎచ్చెర్ల, ఆగస్టు 4: ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థులందరికీ ఇక్కడే తరగతులు నిర్వహించేలా కృషి చేస్తానని కేంద్ర పౌరవిమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు హామీనిచ్చారు. ఆదివారం శ్రీకాకుళంలోని క్యాంప్ ఆఫీసులో కేంద్రమంత్రిని శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ కలిశారు. క్యాంపస్‌లో సమీకృత ఇంజనీరింగ్‌లో పీయూసీ రెండేళ్లు, ఇంజనీరింగ్ నాలుగేళ్ల కోర్సులు ఉన్నాయని మంత్రికి వివరించారు. క్యాంపస్‌లో పీయూసీ బ్యాచ్ తోపాటు ఇంజనీరింగ్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మాత్రమే తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇక్కడ వసతి లేని కారణంగా నూజివీడు క్యాంపస్‌లో ఇంజనీరింగ్ 3,4 సంవత్సరాల విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. నిర్మాణంలో ఉన్న భవనాన్ని పూర్తిచేసి.. పూర్తిస్థాయిలో అన్ని బ్యాచీలకు ఈ క్యాంపస్‌లోనే తరగతులు నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు.

మెట్టవలసలో డయేరియా

● సుమారు 30 మందికిపైగా బాధితులు
● ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వైనం
● పట్టించుకోని అధికారులు
● భయాందోళనలో గ్రామస్థులు

జి.సిగడాం, ఆగస్టు 4: జి.సిగడాం మండలం మెట్టవలసలో డయేరియా విజృంభించింది. రెండు రోజులుగా సుమారు 30మంది వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. రాజాం, శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మెట్టవలసకు చెందిన కిలారి రాము, పైల శివ, గొర్లె చిన్నంనాయుడు పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(రిమ్స్)కి తరలించారు. అలాగే కిలారి నారాయణమ్మ, తాంద్రోతు చరణ్, లాబాన రాజు, బూరాడ పార్వతి, లాబాన దమయంతి, యడ్ల రాధ, డకర చైతన్య, గొర్లె వెంకటనాయుడు, పోలాకి శిరీష, బూరాడ పార్వతి, బెవర పల్లివి, మజ్జి మహేంద్ర, గొర్లె ధర్మతేజ, వడ్డిపల్లి రమణమ్మ, వడ్డిపల్లి చిన్న, బెవర ప్రభాకరరావు, తాంపైల ప్రణీత్‌నాయుడు, లాబాన జాహ్నవి, లాబాన అప్పన్న, లాబాన రాజు, మౌళీ, కిలారి నారాయణరావు, కిలారి స్రవంతి తదితరులు రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. సర్పంచ్ కామోజుల ఆరుద్ర, ఎంపీటీసీ సభ్యురాలు బెవర లక్ష్మి.. డయేరియా వ్యాప్తిపై అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రతి ఇంట్లోనూ ఒకరిద్దరు బాధితులు ఉన్నారని వాపోతున్నారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారులు, సిబ్బంది ఇటీవల ఇంటింటా సర్వే చేశారు తప్ప.. వైద్యసేవలు అందించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుధ్య నిర్వహణపై పంచాయతీ అధికారులు కూడా దృష్టి సారించడం లేదని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందజేయాలని కోరుతున్నారు.





రాజాం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

పప్పు ఉడకదు.. తీపి ఉండదు..

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

● ఈ నెల రేషన్.. బియ్యం, గోధమపిండి మాత్రమే
● గత ప్రభుత్వ తప్పిదాలతో గందరగోళం
● ప్యాకెట్ల బరువు తగ్గడంతో కాంట్రాక్టు నిలిపివేత
● వచ్చేనెల నుంచి పూర్తిస్థాయిలో సరఫరా...



గోధుమపిండి

వైసీపీ పాలనలో చేసిన ప్రభుత్వ తప్పిదాలు.. ఇప్పటికీ సామాన్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. నిత్యావసర సరుకుల పంపిణీలోనూ అవకతవకలకు పాల్పడడంతో రేషన్‌కార్డు దారులకు అరకొర వస్తువులు అందజేయాల్సి వస్తోంది. ఈ నెల రేషన్‌లో కందిపప్పు, పంచదార లేదు. కేవలం బియ్యం, గోధుమపిండి మాత్రమే సరఫరా చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కందిపప్పు, పంచదార ప్యాకెట్ల రూపంలో పంపిణీ చేసేందుకు ఇచ్చిన కాంట్రాక్టులో.. బరువులో తక్కువగా ఉన్నట్లు ఇటీవల రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ గుర్తించారు. దీంతో తీగ లాగితే డొంక కూడా కదిలింది. పలుచోట్ల ప్యాకెట్లలో కందిపప్పు సుమారు 15 నుంచి 50 గ్రాములు, పంచదార కూడా 50 గ్రాముల వరకు తక్కువ ఉన్నట్లు గుర్తించారు. దీంతో పాత కాంట్రాక్ట్‌ను పక్కన బెట్టినట్లు సమాచారం. గత ప్రభుత్వ అక్రమాలు బయటపడుతుండటంతో ప్రస్తుతానికి కందిపప్పు, పంచదార సరఫరాను నిలిపివేశారు. ఈ నెల బియ్యం, గోధుమపిండి మాత్రమే పంపిణీ చేస్తున్నారు. సరైన పరిమాణం గల కందిపప్పు, పంచదార ప్యాకెట్లను వచ్చే నెల నుంచి మరో ఏజెన్సీతో పంపిణీ చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. గత ప్రభుత్వ అక్రమాలపై ఎన్డీయే కూటమి సర్కార్ విచారణ చేపట్టనుంది. గతంలో ఏడాదికి మూడు నెలలైనా కందిపప్పు పంపిణీ చేసేవారు కాదు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసరఫరాల ద్వారా నిత్యావసర సరుకులన్నీ అందుతాయని జిల్లావాసులు భావించారు. కాగా.. వైసీపీ పాలనలో అక్రమాల కారణంగా.. ప్రస్తుతం సరుకుల పంపిణీలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని రేషన్ కార్డుదారులు వాపోతున్నారు. నిత్యావసర సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ కె.శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా.. ఈ నెల కందిపప్పు, పంచదార లేదని.. బియ్యం, గోధుమపిండి మాత్రమే ఇస్తున్నామని స్పష్టం చేశారు.



● అదనపు వసూళ్లు..

జిల్లాలో 6,69,858 రేషన్ కార్డులు ఉన్నాయి. కార్డులోని ఒక్కో సభ్యుడికి 5కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. అలాగే పంచదార అరకిలో, కందిపప్పు కిలో ఇవ్వాల్సి ఉంది. కందిపప్పు, పంచదార పంపిణీ వ్యవస్థ సరిదిద్దాలంటే పైస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇదిలాఉండగా.. పంచదార అరకిలో రూ.16.50 చొప్పున విక్రయించాలి. పంపిణీ చేసినప్పుడు మాత్రం కార్డుదారుల నుంచి ఎండీయూ ఆపరేటర్లు రూ.20 చొప్పున తీసుకుంటున్నారు. అలాగే కందిపప్పు రూ.67కే విక్రయించాల్సి ఉండగా రూ.70చొప్పున వసూలు చేస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా కార్డుదారుల నుంచి ప్రతినెలా అదనంగా రూ.43లక్షలపైగా వసూలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిత్యావసరాల పంపిణీ తీరును కనీసం పర్యవేక్షించిన దాఖలాలు లేవు. ఇప్పుడున్న అధికారి కూడా అదే పరిస్థితి. ఇటువంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది.

విశాఖ రేంజ్‌లో 35 మంది సీఐలకు బదిలీలు

● జిల్లా నుంచి పలువురికి స్థానచలనం

విశాఖపట్నం/ శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 4: విశాఖపట్నం రేంజ్‌లో 35మంది సీఐలను బదిలీ చేస్తూ.. డీఐజీ గోపినాథ్ జెట్టీ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. వీరిలో కొంత మందిని రేంజ్ వీఆర్‌కు సరెండర్ చేయగా, వీఆర్‌లో ఉన్న కొందరికి పోస్టింగ్‌లు కల్పించారు. బదిలీ అయిన వారిలో ఎక్కువ మంది శ్రీకాకుళం జిల్లాకు చెందిన వారు ఉన్నారు.

పేరు	ప్రస్తుతం ఉన్నచోటు	బదిలీ అయినచోటు
ఎస్.గోవిందరావు	కళింగపట్నం మెరైన్	పార్వతీపురం రూరల్
మట్టల అవతారం	శ్రీకాకుళం ట్రాఫిక్	జేఆర్‌పురం (రణస్థలం)
జి.రామచంద్రరావు	జేఆర్ పురం(రణస్థలం)	రేంజ్ వీఆర్
చరకాన సూరినాయుడు	శ్రీకాకుళం టాస్క్‌ఫోర్స్‌సెల్	విజయనగరం ట్రాఫిక్
చింతాడ ప్రసాద్	రేంజ్ వీఆర్	కొత్తూరు
ఆర్.వేణుగోపాల్	కొత్తూరు	రేంజ్ వీఆర్
బోరపు మంగరాజు	చినమేరంగి	సోంపేట
హెచ్. మల్లేశ్వరరావు	సోంపేట	రేంజ్ వీఆర్
జే.శ్రీనివాసరావు	సీఐడీ	నరసన్నపేట
బూర ప్రసాదరావు	నరసన్నపేట	రేంజ్ వీఆర్
కునుకు శ్రీనివాసరావు	ఇంటెలిజెన్స్	టెక్కలి రూరల్
ఎస్. సూర్యచంద్రమౌళి	టెక్కలి రూరల్	రేంజ్ వీఆర్
ఎం.చిన్నంనాయుడు	ఏసీబీ	ఇచ్ఛాపురం
టి.ఇమ్మాన్యుయేల్‌రాజు	ఇచ్ఛాపురం	స్పెషల్‌బ్రాంచి, శ్రీకాకుళం
ఆర్.సత్యనారాయణరెడ్డి	స్పెషల్‌బ్రాంచి శ్రీకాకుళం	రేంజ్ వీఆర్
కె.పైడపునాయుడు	సీఐడీ	శ్రీకాకుళం రూరల్
లెంక సన్యాసినాయుడు	శ్రీకాకుళం రూరల్	రేంజ్ వీఆర్

పిచ్చికుక్క స్వైర విహారం

● ఆరుగురికి గాయాలు

సోంపేట, ఆగస్టు 4: సోంపేట మండలం పాలవలసలో ఆదివారం పిచ్చికుక్క స్వైరవిహారం చేసి.. ఆరుగురిని గాయపరిచింది. గ్రామానికి చెందిన దున్న నోమిత్, దుమ్ము ఓంకార్, టి.ధనలక్ష్మి, డి.వెంకటరావు, సంగారు దూదమ్మతోపాటు మరొకరిపై కుక్క దాడి చేసింది. వీరిలో దూదమ్మకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు సోంపేట కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన బాధితులు కొర్లాం పీహెచ్‌సీ, సోంపేట ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్టు గ్రామస్థులు తెలిపారు. కుక్కల బెడద నుంచి రక్షించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న దూదమ్మ

నవ్య | చిత్రజ్యోతి

మెగా విరాళం

కేరళ సీఎం సహాయ నిధికి చిరంజీవి, రామ్‌చరణ్ రూ. కోటి, అల్లు అర్జున్ రూ. 25 లక్షలు





కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగి పడి నష్టపోయిన కుటుంబాలకు ఆసరా అందించేందుకు.. కేరళ ముఖ్యమంత్రి సహాయనిధికి ఇప్పటికే పలువురు సినీతారలు విరాళాలు అందించిన సంగతి తెలిసిందే. ఆదివారం మెగాస్టార్ చిరంజీవి, రామ్‌చరణ్, అల్లుఅర్జున్ కూడా బాధితులు విరాళాలు ప్రకటించారు. చిరంజీవి, రామ్‌చరణ్ రూ.కోటి విరాళం అందించి, ఈ విపత్తులో నష్టపోయిన కుటుంబాలకు తమ వంతు సహాయాన్ని చాటారు. "ప్రకృతి విపత్తు వల్ల జరిగిన ఈ ప్రాణ నష్టాన్ని చూస్తుంటే నా గుండె బరువెక్కిపోతోంది. బాధితుల కుటుంబాలు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను" అని చిరంజీవి ఎక్స్‌లో పేర్కొన్నారు. మరోవైపు, ఆదివారం ఉదయం అల్లు అర్జున్ కూడా రూ.25 లక్షల విరాళం ప్రకటించారు. "కేరళలో జరిగిన ఈ సంఘటన నన్ను తీవ్రంగా కలిచివేసింది. కేరళ ప్రజలు నాపై ఎంతో ప్రేమ చూపారు. వారి కోసం నా వంతుగా నేను ఈ సహాయం చేస్తున్నాను" అని అల్లు అర్జున్ ఎక్స్‌లో పేర్కొన్నారు. సంయుక్త మీనన్ కేరళలో సహాయ కార్యక్రమాలు చేపడుతున్న విశ్వశాంతి ఫౌండేషన్‌కు విరాళం అందించినట్లు తెలిపారు. కానీ ఆమె ఎంత మొత్తం అందించారు అనేది గోప్యంగా ఉంచారు.

క్లైమాక్స్‌లో...



చిరంజీవి కథానాయకుడిగా తెరకెక్కుతోన్న సోషియో-ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'విశ్వంభర'. ప్రస్తుతం హైదరాబాద్‌లో క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతున్నట్లు యూనిట్ ఆదివారం ప్రకటించింది. 'సినిమా మొత్తం ఒకెత్తు, క్లైమాక్స్ ఒక్కటి మరో ఎత్తు అనేలా ఉండబో తోంది, భారీ సెట్స్ విజువల్ ఎఫెక్ట్స్‌తో దర్శకుడు వశిష్ఠ క్లైమాక్స్ సీక్వెన్స్‌ను దృశ్యకావ్యంలా తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు. పతాక సన్నివేశాలకు ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ అనల్ అరసు నేతృత్వం వహిస్తున్నారు. వచ్చే ఏడాది జనవరి 10న 'విశ్వంభర' ప్రేక్షకుల ముందు కొస్తోంది. విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. త్రిష హీరోయిన్.

విజేతలు వీరే...















దక్షిణాది తారలంతా తళుక్కున మెరిసిన '69వ ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి అట్టహాసంగా జరిగింది. గెలుపు గుర్రాలకు పురస్కారాలను అందించారు. సిద్ధార్థ్ నటించిన తమిళ చిత్రం 'చిన్నా' అత్యధికంగా ఏడు అవార్డులు కొల్లగొట్టగా.. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని, కీర్తి సురేశ్ జంటగా తెరకెక్కిన 'దసరా' చిత్రం ఆరు విభాగాల్లో పురస్కారాలను కైవసం చేసుకుంది. ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య నటించిన 'బేబీ'.. మణిరత్నం తెరకెక్కించిన 'పొన్నియన్ సెల్వన్ 2' ఐదు అవార్డులతో మూడో స్థానంలో నిలిచాయి. తమిళంలో ఉత్తమ నటుడిగా 'పొన్నియన్ సెల్వన్ 2' చిత్రానికి విక్రమ్.. 'మామన్నన్' (నాయకుడు) సినిమాకు ఉత్తమ సహాయ నటుడిగా 'పుష్ప' ఫేమ్ ఫహాద్ ఫాజిల్, ఉత్తమ నటిగా 'చిన్నా' చిత్రానికి నిమిషా సజయన్ ఎంపికయ్యారు. తెలుగువారిని విశేషంగా అలరించిన కన్నడ చిత్రం 'సప్త సాగరాలు దాటి' చిత్రానికి ఉత్తమ నటుడిగా రక్షిత్ శెట్టి, ఉత్తమ నటిగా రుక్మిణీ వసంత్ ఎంపికయ్యారు. మలయాళ నటుడు మమ్ముట్టి 'నన్‌పకల్ నేరతు మయక్కం' చిత్రానికి ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. అవార్డుల ప్రదానోత్సవంలో నాని మాట్లాడుతూ "కెరీర్ తొలినాళ్లలో అవార్డులు అందుకోవాలనే ఆసక్తి ఉండేది. ఇప్పుడు నేను నటించిన, నిర్మించిన సినిమాల్లోని నటీనటులు ఈ అవార్డులు అందుకుంటుంటే చూడాలని ఉంది. నాతో సినిమాలు తీసిన ఇద్దరు నూతన దర్శకులు అవార్డులు అందుకొన్నందుకు ఆనందంగా ఉంది" అని చెప్పారు. "ఓ అభిమాని చేసిన పనిని నేను ఇప్పటికీ మర్చిపోలేదు. ఓ అభిమాని.. ఓ రోజు హఠాత్తుగా పెళ్లి చేసుకుంటానని.. ఇంటి వాకిలి ముందు వాలిపోయాడు. ఆ సంఘటనతో ఒక్కసారిగా షాక్ అయ్యా" అని కీర్తి సురేశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి వాఖ్యాతలుగా సందీప్ కిషన్, ఫరియా అబ్దుల్లా, విశాఖ వాఖ్యాతలుగా వ్యవహరించారు.

తెలుగు సినిమా విజేతల వివరాలు

ఉత్తమ చిత్రం - బలగం
ఉత్తమ దర్శకుడు - వేణు ఎల్దండి (బలగం)
ఉత్తమ పరిచయ దర్శకుడు - శ్రీకాంత్ ఓదెల (దసరా), శౌర్యువ్ (హాయ్ నాన్న)
ఉత్తమ దర్శకుడు(విమర్శకుల ఎంపిక) - సాయి రాజేశ్ (బేబీ)
ఉత్తమ నటుడు - నాని (దసరా)
ఉత్తమ నటుడు (విమర్శకుల ఎంపిక) - ప్రకాశ్ రాజ్(రంగ మార్తాండ), నవీన్ పొలిశెట్టి (మిస్ శెట్టి, మిస్టర్ పొలిశెట్టి)
ఉత్తమ నటి - కీర్తి సురేశ్,
ఉత్తమ నటి (విమర్శకుల ఎంపిక) - వైష్ణవి చైతన్య (బేబీ)
ఉత్తమ సహాయ నటుడు - బ్రహ్మానందం (రంగమార్తాండ), రవితేజ (వాల్తేరు వీరయ్య)
ఉత్తమ సహాయ నటి - రూపా లక్ష్మి (బలగం)
ఉత్తమ మ్యూజిక్ ఆల్బమ్ - బేబీ
ఉత్తమ గీత రచయిత - అనంత శ్రీరామ్ (బేబీ)
ఉత్తమ నేపథ్య గాయకుడు - శ్రీరామ చంద్ర (ఓ రెండు ప్రేమ మేఘాలిలా - బేబీ)
ఉత్తమ నేపథ్య గాయని - శ్వేతా మోహన్ (మాస్టారు మాస్టారు - సార్)
ఉత్తమ సినిమాటోగ్రఫీ - సత్యన్ సూరన్ (దసరా).

క్రేజీగా రాంబో



షమ్ము హీరోగా హరీశ్ మధురెడ్డి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'క్రేజీ రాంబో'. ర్యాప్‌రాక్ షకీల్ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాను ప్రారంభించి టైటిల్‌ను లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో అశ్విన్‌బాబు మాట్లాడుతూ "టైటిల్ చాలా ఆసక్తికంగా ఉంది. సినిమా తప్పకుండా మంచి విజయం సాధించాలి" అని చెప్పారు. హీరో షమ్ము మాట్లాడుతూ "ఈ సినిమా కథ అద్భుతంగా ఉంటుంది" అని చెప్పారు. "చాలా మంచి కంటెంట్ ఉన్న చిత్రమిది" అని నిర్మాత ర్యాప్‌రాక్ షకీల్ అన్నారు.

స్కూల్ లైఫ్‌ను గుర్తుకు తెచ్చేలా



ప్రియదర్శి, విశ్వదేవ్, భాగ్యరాజ్, నివేత థామస్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నంద కిషోర్ ఈమాని దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఆదివారం స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఈ చిత్రం నుంచి 'సయ్యారే సయ్యా' పాటను విడుదల చేశారు. అందరికీ స్కూల్ లైఫ్ జ్ఞాపకాలను, బాల్య స్నేహాలను గుర్తుకు తెచ్చేలా సాగిందీ పాట. కిట్టు విస్సాప్రగడ సాహిత్యం అందించగా, కార్తీక్ ఆలపించారు. వివేక్ సాగర్ సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: టి.సి.ప్రసన్న, డీఓపీ: నికేత్ బొమ్మ.



డబుల్... కిక్ ఇచ్చింది

'కమర్షియల్ సినిమా అంటే గుర్తుకొచ్చేది పూరి జగన్నాథ్. ఆయన ఇప్పటివరకూ చేసిన సినిమాల్లో ఎక్కువ సమయం, కష్టం పెట్టిన సినిమా 'డబుల్ ఇస్మార్ట్'. స్క్రిప్ట్ విన్నప్పుడు ఎంత కిక్ వచ్చిందో, ఇస్మార్ట్ శంకర్ పాత్రలో నటిస్తున్నప్పుడూ అంతే కిక్ ఇచ్చింది. త్వరలో థియేటర్లలో కలుద్దాం' అని హీరో రామ్ పోతినేని అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని ఆదివారం వైజాగ్‌లో నిర్వహించారు. పూరి జగన్నాథ్ వీడియో సందేశంలో మాట్లాడుతూ 'వైజాగ్ గల్లీల్లో తిరిగినవాణ్ణి. నేను తీసిన గల్లీ సినిమా ఇది. సీ సెంటర్లలో విజిల్స్ వేస్తూ చూడండి' అని ప్రేక్షకులను కోరారు. థియేటర్‌కి పట్టిన తుప్పును వదలగొట్టే సినిమా ఇదని అలీ అన్నారు. ఒక మంచి చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని హీరోయిన్ కావ్యథాపర్ చెప్పారు.

గొప్ప సినిమాగా నిలిచిపోతుంది



"తంగలాన్ వందేళ్ల క్రితం జరిగిన కథ. అందమైన సాహసోపేత ప్రయాణం ఈ సినిమా. మిమ్మల్ని ఆశ్చర్యంలో ముంచెత్తాలని ఈ సినిమా గురించిన ముఖ్యమైన విషయాలేవి బయటకు చెప్పలేదు. నా కెరీర్‌లో అత్యుత్తమ పాత్రను ఈ సినిమాలో చేశాను' అని హీరో విక్రమ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా పా రంజిత్ రూపొందించిన చిత్రమిది. ఈ నెల 15న విడుదలవుతోంది. చిత్రబృందం ఆదివారం హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. పా రంజిత్ మాట్లాడుతూ 'మనదేశంలో అణచివేత, అసమానత్వం ఇంకా ఉన్నాయి. వీటిని ఎదుర్కొనేందుకు నేను సినిమాను మాధ్యమంగా ఎంచుకున్నాను. నా గత చిత్రాల్లానే 'తంగలాన్'ను కూడా తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. తంగలాన్ ప్రచార చిత్రాల్లో మా కష్టం కనపడుతోంది అని నిర్మాత జ్ఞానవేల్ రాజా అన్నారు.

సందేశాన్నిచ్చే 'సింబా'



జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. మురళీ మనోహర్ దర్శకత్వంలో సంపత్ నంది, దాసరి రాజేందర్‌రెడ్డి నిర్మించారు. ఈ నెల 9న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా జగపతిబాబు మాట్లాడుతూ "ఇది ప్రకృతి మీద ఉన్న ప్రేమతో తీసిన సినిమా. ఈ సినిమా అందరికీ నచ్చుతుంది" అని తెలిపారు. నిర్మాత సంపత్ నంది మాట్లాడుతూ "ఈ సినిమా వినోదంతో పాటు మంచి సందేశాన్ని ఇస్తుంది. ఇది సమాజం కోసం తీసిన సినిమా" అని అన్నారు. "సినిమా చాలా కొత్త పాయింట్‌తో ఉంటుంది. సంపత్ నంది అద్భుతమైన కథను ఇచ్చారు" అని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. "వనజీవి రామయ్య' జీవితం ఆధారంగా ఈ కథను రాసుకున్నారు సంపత్ నంది" అని నిర్మాత దాసరి రాజేందర్‌రెడ్డి అన్నారు.

ఆ 67 కోట్లు వదిలేస్తారా?



- ఈ-ఆటో కొనుగోళ్లలో ఎస్సీ కార్పొరేషన్ సొమ్ము స్వాహా
- అడ్వాన్స్ తీసుకుని సరఫరా చేయని డీలర్లు
- అడ్వాన్స్ తిరిగి చెల్లించకపోయినా పట్టించుకోని గత ప్రభుత్వం
- వారికి అండదండలందించిన ఓ ఐఏఎస్ అధికారి
- ఇప్పుడైనా వసూలు చేస్తారో లేదో!

> వైసీపీకి ముఖ్యుడైన ఆ ఐఏఎస్ అధికారి కారణంగా ఎస్సీ కార్పొరేషన్‌కు రూ.67 కోట్లు గండిపడింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను అప్పనంగా ఓ డీలర్‌కు ఇచ్చేశారు. ఈ-ఆటోల కొనుగోలు కోసం అడ్వాన్స్ చెల్లించినా ఆ డీలర్ ఆటోలు సరఫరా చేయకపోగా, తిరిగి ఆ సొమ్మును కూడా ప్రభుత్వానికి వాపసు చేయకపోవడం దారుణం. అడ్వాన్స్‌లు ఇచ్చింది గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అయినా... గత వైసీపీ ప్రభుత్వం కూడా ఈ డీలర్ల నుంచి ఆ సొమ్మును వసూలు చేయలేకపోవడానికి ఆ అధికారే కారణమని చెప్తున్నారు. ప్రస్తుతం రిటైర్ అయిన ఆ అధికారి ఆ డీలర్ ఆ అధికారికి బినామీనేనని... అందుకే గతంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులుగా పనిచేసిన పినిపె విశ్వరూప్, మేరుగ నాగార్జునలు కూడా డీలర్‌కు ఇచ్చిన అడ్వాన్స్ తిరిగి రాబట్టుకునేందుకు విఫలయత్నాలు చేశారన్న అపవాదు ఉంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గతంలో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని అమలు చేసే క్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలను కొనుగోలు చేసేందుకు టెండర్లు పిలిచింది. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో చెత్తను సేకరించి వాటిని ఘనవ్యర్థాల షెడ్‌కు తరలించి సేంద్రియ ఎరువులు తయారుచేయాలనేది లక్ష్యం. అందుకోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఈ-ఆటోలను ఎస్సీ యువత ద్వారా కొనుగోలు చేసి వాటిని చెత్తను తరలించేందుకు గ్రామ పంచాయతీల్లో వినియోగించాలని నిర్ణయించారు. 2017-18, 2018-19 సంవత్సరాలకు సంబంధించి జాతీయ సఫాయి కర్మచారీ ఆర్థిక అభివృద్ధి సంస్థ(ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ), జాతీయ ఎస్సీ ఆర్థిక అభివృద్ధి సంస్థ నిధులు(ఎన్ఎస్‌సీఎఫ్‌డీసీ) వాడుకోవాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా అప్పటి ఉమ్మడి 13 జిల్లాల్లో 13 ఈ-ఆటో సర్వీసు కేంద్రాలను ప్రారంభించాలని, భవిష్యత్తులో 42 సర్వీసు కేంద్రాలుగా విస్తరించాలని ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అప్పట్లో ఈ-ఆటోలను సరఫరా చేసేందుకు పుణెకు చెందిన కెనెటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సంస్థ ఆథరైజేషన్‌తో తాడేపల్లికి చెందిన వెంకటేశ్వర ట్రేడర్స్ ఒప్పందం చేసుకుంది. ఈమేరకు 7500 పవర్ ఆటోలు సరఫరా చేయాలని ఒప్పందం చేసుకుని రూ.77.91 కోట్లు అడ్వాన్స్‌గా పొందారు. కొనుగోలు ఆర్డర్‌ను ఎస్సీ కార్పొరేషన్ వీసీ అండ్ ఎండీ ఇచ్చారు. అయితే అనిల్‌కుమార్‌రెడ్డి రూ.57.98 కోట్ల విలువ కలిగిన 2,550 వాహనాలు మాత్రమే సరఫరా చేశారు. ఇంకా 4,950 వాహనాలు సరఫరా చేయాల్సి ఉంది. అడ్వాన్స్ ఇంకా రూ.19.92 కోట్లు ఆయన వద్దనే మిగిలిపోయింది. అనిల్‌కుమార్‌రెడ్డి ఈగల్ అగ్రి ఎక్విప్‌మెంట్, కావలి పేరుతో 280 మెకనైజ్డ్ డ్రైయిన్ క్లీనింగ్ మెషిన్లు సరఫరా చేస్తామని రూ.23.72 కోట్లు అడ్వాన్స్ తీసుకుని రూ.14.27 కోట్లు విలువ కలిగిన 209 మెషిన్లు మాత్రమే సరఫరా చేశారు. ఇంకా 71 మెషిన్లు సరఫరా చేయాల్సి ఉన్నప్పటికీ అవి సరఫరా చేయకపోగా తిరిగి చెల్లించాల్సిన రూ.9.45 కోట్లు కోట్లు తిరిగి చెల్లించలేదు. ఇదే కంపెనీ 660 ట్రాక్టర్లు సరఫరా చేస్తామని రూ.38.87 కోట్లు అడ్వాన్స్ తీసుకుని రూ.26.56 కోట్లు విలువ కలిగిన 451 ట్రాక్టర్లు మాత్రమే సరఫరా చేశారు. తిరిగి చెల్లించాల్సిన రూ.12.31 కోట్లు డీలర్ వద్దనే ఉన్నాయి. వెరసి ఒక్క అనిల్‌కుమార్‌రెడ్డి వద్దనే రూ.41.68 కోట్లు నిలిచిపోయాయి. ఇదే రకంగా మరో డీలర్ రాధా మాధవ్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 1647 ఇన్నోవాలు ఇతియోస్ వాహనాలు సరఫరా చేస్తామని రూ.221.64 కోట్లు అడ్వాన్స్ తీసుకుంది. రూ.198.59 కోట్ల విలువ కలిగిన1417 వాహనాలు సరఫరా చేసింది. ఇంకా 230 వాహనాలు సరఫరా చేయాల్సి ఉంది. అడ్వాన్స్‌లో రూ.23.05 కోట్లు డీలర్ వద్దనే నిలిచిపోయింది. తిరిగి చెల్లించడం లేదు. అప్పటి ధరల ప్రకారం వాహనాలు ఇవ్వలేమని, పెరిగిన ధరల ప్రకారం తీసుకునేందుకు అంగీకరిస్తే పరిశీలిస్తామని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నట్లు తెలుస్తోంది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఎంట్రాన్ ఆటోమొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ 15 మెకనైజ్డ్ డ్రెయిన్ క్లీనింగ్ మెషిన్లు సరఫరా చేస్తామని రూ.3.52 కోట్లు అడ్వాన్స్‌గా తీసుకుని 6 మెషిన్లు సరఫరా చేసింది. ఇంకా 9 వాహనాలు సరఫరా చేయలేదు. వారు తీసుకున్న అడ్వాన్స్ ఇంకా రూ.2.93 కోట్లు ఆ కంపెనీ వద్దనే మిగిలి ఉంది. మొత్తంగా ముగ్గురు వ్యక్తులు కలిసి మొత్తం రూ.67.67 కోట్లు అడ్వాన్స్ ఎస్సీ కార్పొరేషన్‌కు తిరిగి చెల్లించాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. ఎస్సీ కార్పొరేషన్‌తో ఒప్పందం చేసుకున్న నేపథ్యంలో కెనటిక్ గ్రీన్ ఎనర్జీ సంస్థ నుంచి రూ.7.72 కోట్లకు గాను ఐసీఐసీఐ బ్యాంక్ జారీచేసిన ఈఎండీని సమర్పించారు. ఈ ఈఎండీ బ్యాంక్ గ్యారెంటీ జనవరి 24, 2022 వరకు గడువు ఉండేట్లు తీసుకున్నారు. ఈ బ్యాంక్ గ్యారెంటీని సమర్పించిన తర్వాత ఎస్సీ కార్పొరేషన్‌కు లేఖ రాస్తూ మొత్తం సరఫరా చేసే ఈ-ఆటోల విలువలో 25 శాతం మొత్తంతో పాటు రూ.1.50 కోట్ల ఈఎండీ మొత్తాన్ని అడ్వాన్స్‌గా చెల్లించాలని ఎస్సీ కార్పొరేషన్‌కు సంస్థ లేఖ రాసింది. ఈ చెల్లింపులు సంస్థ ఆథరైజ్డ్ డీలర్ వెంకటేశ్వర ట్రేడర్స్‌కు చెల్లించాలని ఆథరైజ్ చేసింది. అయితే ఆ తర్వాత కెనటిక్ గ్రీన్ ఎనర్జీ అండ్ పవర్ సొల్యూషన్స్ లిమిటెడ్ సమర్పించిన బ్యాంక్ గ్యారెంటీ నకిలీదని తేలింది. దీనిపై ఎన్ని నోటీసులిచ్చినా వెంకటేశ్వర ట్రేడర్స్ లెక్కచేయలేదు. ఆ తర్వాత మంత్రి విశ్వరూప్ పదవి మారడంతో కొత్తగా వచ్చిన మంత్రి మేరుగ నాగార్జున కూడా అడ్వాన్స్ తిరిగి చెల్లించాలని డీలర్లకు హెచ్చరించడంతో ప్రభుత్వ పెద్దలు రంగంలోకి దిగారు. సీఎం కార్యాలయం నుంచి, ప్రభుత్వ పెద్దల నుంచి ఫోన్లు రావడంతో అడ్వాన్స్ తిరిగి చెల్లించే ప్రక్రియ ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఈ-ఆటోలను, ఇన్నోవాలను సరఫరా చేయని డీలర్ నుంచి అడ్వాన్స్‌ను తిరిగి రాబట్టడంలో సాక్షాత్తు ఆ శాఖ మంత్రులే విఫలమవ్వడం వెనుక ఆ ఉన్నతాధికారి హస్తముందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. జగన్ సర్కార్‌లో ఆ అధికారి కీలకంగా ఉన్నారని, ఆయన మాట చెల్లుబాటు కావడంతోనే ఐదేళ్ల పాటు ఈ అవినీతిని కప్పిపుచ్చుకోగలిగారని పేర్కొంటున్నారు.

అవయవాల రవాణా సమయంలో ఎయిర్ ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలి

వైద్య సిబ్బందికి రిజర్వేషన్, ముందు సీట్లు కేటాయించాలి.. కేంద్రం మార్గదర్శకాలు

న్యూఢిల్లీ, ఆగస్టు 4: అవయవ దానంతో మరొకరికి ప్రాణదానం చేయొచ్చు. అయితే.. అవయవ దాత, గ్రహీత వేర్వేరు నగరాల్లో లేదా రాష్ట్రాల్లో ఉన్నప్పుడు సజీవ అవయవాన్ని వీలైనంత త్వరగా రవాణా చేయాల్సి ఉంటుంది. ఏ మాత్రం ఆలస్యం జరిగినా ప్రయత్నమంతా వృథా అవుతుంది. అందుకే అవయవ రవాణాలో ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు అవలంబించాల్సిన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపీ)ని కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. విమానాలతో సహా వివిధ ప్రయాణ మార్గాల ద్వారా అవయవాలను అత్యంత వేగంగా రవాణా చేసేందుకు ఈ ఎస్ఓపీ వీలుకల్పిస్తుంది. నీతి ఆయో గ్, నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్‌ప్లాంట్ ఆర్గనైజేషన్ వంటి సంస్థల భాగస్వామ్యంతో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తొలిసారిగా ఈ తరహా ఎస్ఓపీని రూపొందించింది. విమానాల్లో అవయవాలు రవాణా చేసే సమయంలో టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో ఎయిర్ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడడం, వై ద్య సిబ్బందికి ప్రాధాన్య రిజర్వేషన్, ముందు వరుస సీట్లను కేటాయించడం, ఎయిర్‌పోర్టుకు చేరుకునే క్ర మంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా గ్రీన్ కారిడార్ ఏర్పాటు వంటి అంశాలు దీనిలో ఉన్నాయి. అలా గే అంబులెన్స్, ఇతర రవాణా మార్గాల ద్వారా అవయవాల రవాణాను సులభతరం చేయడానికి నిర్దిష్ట అధికారులు లేదా ఏజెన్సీల అభ్యర్థన మేరకు గ్రీన్ కారిడార్ ఏర్పాటు చేయవచ్చని దీనిలో పేర్కొన్నారు. రాష్ట్రంలోగానీ, ఒక నగరంలోగానీ అవయవ రవాణా కోసం 'గ్రీన్ కారిడార్' ఏర్పాటుకు సమ్యలేమై నా ఉంటే వాటిని పరిష్కరించేందుకు పోలీస్ శాఖకు చెందిన ఒక నోడల్ అధికారిని నియమించవచ్చని సూచించారు.

సీఎం గారూ.. దయ చూపరూ!

- చంద్రబాబుకు ఖైదీల కుటుంబాల వేడుకోలు
- రెండున్నరేళ్లుగా 160 మంది సత్ప్రవర్తన ఖైదీల నిరీక్షణ
- తాజాగా ఏపీ సర్కారుకు జైళ్లశాఖ ప్రతిపాదనలతో ఆశలు

అమరావతి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): తెలిసో తెలియకో.. పొరపాటునో.. క్షణికావేశంలోనో.. తప్పు చేసిన తమ వారిపై దయచూపండి చంద్రబాబు గారూ అంటూ రాష్ట్రంలోని పలు జైళ్లలో మగ్గుతున్న ఖైదీల కుటుంబాల సభ్యులు ముఖ్యమంత్రిని వేడుకొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీకి చెందిన కొందరు ఖైదీల విడుదలకు ఏమాత్రం అవకాశం లేకపోవడంతో, సత్ప్రవర్తన కలిగినప్పటికీ తమవారు ఇంకా జైళ్లలోనే మగ్గుతున్నారు. అయితే ప్రభుత్వం మారడంతో ఇప్పుడు బాధిత ఖైదీల కుటుంబాల్లో ఆశలు చిగురించాయి. వాస్తవానికి.. ఖైదీలను ప్రతి ఆర్నెళ్లకోసారి జూన్ 30లోపు మొదటి, డిసెంబరు 31లోపు రెండో జాబితా ఎంపిక చేసి విడుదల చేయాలని సుప్రీం కోర్టు 2021లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు పంపింది. కొవిడ్ అనంతర పరిణామాలతో దేశ అత్యున్నత న్యాయస్థానం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అటు కేంద్ర ప్రభుత్వం, దేశంలోని రాష్ట్రాలు సమ్మతించాయి. అయితే మన రాష్ట్రంలో నియంతలా పాలించిన జగన్ రెడ్డి అవేవీ పట్టించుకోలేదు. సుప్రీం కోర్టుతో ఇబ్బందులు వస్తాయని జైళ్ల శాఖ అధికారులు చెప్పినప్పటికీ పెడచెవిన పెట్టారు. పిట్టకథలు చెప్పడంలో పేరుగాంచిన రాయలసీమ మాజీ మంత్రి తమ బంధువులను విడుదల చేయించుకోవడానికి ప్రయత్నించారు. అయితే సుప్రీం కోర్టు మార్గదర్శకాల పరిధిలోకి ఆ ఖైదీలు రాబోరని జైళ్ల శాఖ అధికారులు చెప్పడంతో అర్హులైన వారిని సైతం విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. అయినప్పటికీ ప్రతి ఆర్నెళ్లకోసారి అర్హుల జాబితా సుప్రీం మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేసి ప్రభుత్వానికి జైళ్ల శాఖ పంపింది. కోర్టుతో ఇబ్బందులు రాకుండా 2022లో ఒకసారి హోంశాఖ జీవో ఇచ్చింది తప్ప ఖైదీలను విడుదల చేయలేదు. ఇదిలా ఉండగా ఈ ఏడాది కూడా జూన్ 30నాటికి ఏ జైలులో ఏ ఖైదీ అర్హుడో వివరిస్తూ 160మంది జాబితా వారం రోజుల క్రితం చంద్రబాబు ప్రభుత్వానికి ఏపీ జైళ్లశాఖ పంపింది. ఆగస్టు 15, జనవరి 26తో సంబంధం లేకుండా ఎప్పుడైనా విడుదల చేయవచ్చని ప్రతిపాదనల్లో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయబోయే ఖైదీలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు మార్గం సిద్ధం చేసింది. వీరికిఉపాధి కల్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా జైళ్ల శాఖ పంపిన జాబితా ప్రకారం విడుదలకు అర్హులైన ఖైదీలు.. కోస్తాంధ్ర జైళ్లలో 72మంది, గుంటూరు రేంజ్ పరిధిలో 35మంది, రాయలసీమ జైళ్లలో 53మంది కలిపి మొత్తం 160 మంది ఉన్నారు.

నిస్తేజంలో రవాణా శాఖ

- ప్రజల సహనానికి 'వాహన్-పరివాహన్' పరీక్ష
- ఆన్‌లైన్ సేవల్లో గందరగోళం.. ఆగిపోయిన ఈ ప్రగతి
- ఆగిన ఐటీ ప్రాజెక్టులు.. తిరోగమనంలో రవాణా రంగం



అమరావతి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కోటిన్నరకు పైగా వాహనాలు... నాలుగున్నర వేల కోట్ల ఆదాయం... ఐదు కోట్ల మంది ప్రజలకు రవాణా సర్వీసులు... వేలాది రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు.. ఇంతటి కీలకమైన రవాణా శాఖ ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అనాథలా ఉంది. ఆన్‌లైన్‌లో సేవలు గందరగోళంగా తయారయ్యాయి. గత ప్రభుత్వం సర్వీసు చార్జీ చెల్లించక పోవడంతో ఐటీ విభాగం అస్తవ్యస్తమైంది.. వాహన్-పరివాహన్ మూడేళ్లుగా విజయవాడలో పైలట్‌కే పరిమితం కావడంతో సేవల పొందాలంటే తలప్రాణం తోకలోకి వస్తోంది. 2019కు ముందు చంద్రబాబు ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలతో ఏకంగా 83రకాలా ఆర్టీఏ సేవలు ఆన్‌లైన్లో అందేవి.. డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే ట్రాక్‌లో టెస్ట్ కోసం దరఖాస్తుదారు వెళ్లాలి. వాహనమైతే ఫిట్ నెస్ కోసమే ఆర్టీఏ కార్యాలయానికి వెళ్లాలి. మిగతా అనుమతులు, పన్నులు, ఇతర సేవలన్నీ ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉండేవి. ప్రజలు వాటికి అలవాటు పడి ఇప్పుడు ఈ ప్రగతి ద్వారానే చెల్లింపులు, సర్వీసులు పొందేవారు. వాహన డీలర్లు, ఫైనాన్సియర్లు, ఉత్పత్తిదారులు అందరూ ఆన్‌లైన్‌లోనే అన్నీ పూర్తి చేసేవారు. జగన్ ప్రభుత్వం వచ్చాక ఈ ప్రగతిని ఆపేసింది. డ్రైవింగ్ లైసెన్స్, వాహన ఆర్‌సీ కార్డుల సరఫరా నిలిపేసింది. రాష్ట్రంలో రవాణా రంగమే తిరోగమనం బాట పట్టింది. ఇటు రవాణా శాఖ కమిషనర్ ఎం.కె. సిన్హా హైదరాబాద్ నుంచి విజయవాడలోని ఆఫీసుకు మంగళవారం వచ్చి శుక్రవారం మధ్యాహ్నం నుంచే వెళ్లిపోతుండటం, సంబంధిత శాఖ మంత్రి కూడా సమీక్షించక పోవడంతో ఆ ప్రభావం రవాణా సిబ్బంది పనితీరుపై చూపుతోంది. లారీ యజమానులు కమిషనర్ వద్దకెళ్లి తమ సమస్య చెబితే అవన్నీ భరించాలి తప్పదని ఆయన సమాధనం ఇవ్వడంతో దిక్కుతోచక వెనక్కి తిరిగొచ్చారు. ఐటీ విభాగంలో మ్యాన్ పవర్ సర్వీసెస్‌కు డబ్బులు ఇవ్వకపోగా ఏడాది నుంచి కనీసం రెగ్యులర్ చేయట్లేదు. ఫలితంగా మెన్‌పవర్ సర్వీసులో ఉద్యోగులు మానేసి వెళ్లిపోతుండటంతో రవాణా సేవలకు బ్రేక్ పడింది.

ఐటీ ప్రాజెక్టులన్నీ బంద్...

రవాణా సేవలన్నీ ఇంటి నుంచే ప్రజలు పొందేందుకు ఆ శాఖలో ఐటీ విభాగం కీలకంగా పనిచేసేది. రవాణా వాహన యజమానులు తాత్కాలిక అనుమతి తీసుకోవాలన్నా, త్రైమాసిక పన్నులు చెల్లించాలన్నా ఐటీ విభాగం పనితీరుతోనే ముడిపడి ఉండేది. ఇలా ఐటీకి అధిక ప్రాధాన్యం ఇచ్చే చంద్రబాబు ప్రభుత్వంలో వాహన ట్రాకింగ్ సిస్టమ్ తీసుకొచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా కేంద్రం కూడా కోట్లాది రూపాయల నిధులు తమ వాటాగా ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసి ఐదు కోట్ల రూపాయలు మూడేళ్ల క్రితమే విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం తన వాటా నిధులు విడుదల చేయక పోవడంతో ఏ వాహనం ఎక్కడుందో తెలిసేలా ఆర్టీఏ తీసుకు రావాలనుకున్న ప్రాజెక్టు షెడ్డుకు చేరింది.

ఆగిపోయిన అభయ

ఆడబిడ్డలకు ఆపదొస్తే గన్ కన్నా ముందుగా జగన్ వస్తాడంటూ ఆయన అనుయాయులు పదే పదే చెప్పేవారు. అయితే ఆటోల్లో ప్రయాణించే మహిళలు, యువతుల రక్షణ కోసం అభయ(ఆటో, ట్యాక్సీ ప్రయాణాల్లో ఆపదొస్తే నొక్కే బటన్) ప్రాజెక్టు కోసం కేంద్రం 50కోట్లు విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వం కొంత మ్యాచింగ్ ఇచ్చేందుకు మనసురాక ప్రాజెక్టునే పట్టించుకోకుండా వదిలేసింది. ఇలాంటివి చూసుకోవాల్సిన ఐటీ విభాగం అధికారి శ్రీదేవి ఏడాది పాటు సెలవులో వెళ్లారు. డబ్బులివ్వకుంటే నేను సర్వీసు ఇవ్వలేనంటూ ఐటీ మెన్ పవర్ కాంట్రాక్టరు గోడు వెళ్లబోసుకొంటున్నట్లు సమాచారం. మరోవైపు వాహన్-పరివాహన్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాకుండానే ఈ ప్రగతి ఆపేయడంపై విజయవాడలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

స్నేహమేరా జీవితం..

● ఘనంగా స్నేహితుల దినోత్సవం

ప్రపంచ స్నేహితుల దినోత్సవాన్ని ఆదివారం ఆనందోత్సాహాల నడుమ నిర్వహించారు. పాత, కొత్త స్నేహితులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌లు కట్ చేసి పంచి పెట్టారు. ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లను కట్టుకుని ఆనందం పొందారు. అలాగే పలు సంఘాలు, వాకర్స్ పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. టెక్కలి గిరిజన కళాశాల బాలికల హాస్టల్‌లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. హిరమండలంలో యువకులు రక్తదానం చేశారు.

టెక్కలి/కొత్తూరు/హిరమండలం/నరసన్నపేట/అరసవల్లి


కొత్తూరు: భగత్‌సింగ్ ట్రస్టు ఆధ్వర్యంలో యువత రక్తదానం


టెక్కలి: గిరిజన కళాశాల బాలికల హాస్టల్‌లో కేక్ కట్ చేస్తున్న దృశ్యం


హిరమండలం: ప్రభుత్వ జూనియర్ కళాశాల 1991-93 పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కాపుతెంబూరులో ఇంటింటా సర్వే

నందిగాం: కాపుతెంబూరులో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై సర్వే చేపట్టారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'కాపుతెంబూరులో జ్వరాలు' శీర్షికతో వచ్చిన శీర్షికకు అధికారులు స్పం దించారు. నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గ్రామానికి వెళ్లి జ్వరపీడితుల వివరాలు సేకరించారు. వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. సోమవారం గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు సిబ్బంది తెలిపారు.


రక్తనమూనాలు సేకరిస్తున్న సిబ్బంది

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

పాతపట్నం: నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును ఆదివారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. చిన్నస్థాయిలోనే కేంద్రమంత్రిగా ఎంపికైనా రామ్మోహన్ నాయుడును ఎంజీఆర్ అభినందించారు.


రామ్మోహన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే ఎంజీఆర్

ప్రతిఒక్కరి రుణం తీర్చుకుంటా

పాతపట్నం: ఎమ్మెల్యేగా తనను మంచి మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. విశాఖపట్నంలో వాల్తేర్‌క్లబ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎంజీఆర్‌ను ఆదివారం సత్కరించారు. సత్కరించి తన బాధ్యతను గుర్తు చేసిన వాల్తేర్‌క్లబ్ నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో షైనర్ రాజు, టీకే రాజు, టీఎస్ఎన్ రాజు, కె.రోహన్, క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు ఆషాఢం సారి సమర్పణ


దుర్గమాతకు ఆషాఢం సారిని, ముర్రాటలను తీసుకువెళుతున్న మహిళలు

కోటబొమ్మాళి: ఆషాఢమాసం అమావాస్య ముగియడంతో చీపుర్లపాడు పంచాయతీ ఊడికల పాడు గ్రామానికి చెందిన మహిళలు గ్రామంలోని దుర్గమ్మతల్లికి ఆదివారం ఆషాఢం సారిని సమర్పించారు. శ్రీరామమందిరం నుంచి భక్తులంతా వస్తువులు, పండ్లు, ముర్రాటలు పట్టుకుని మేళ, తాళాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి సారె అందించారు.

చౌడేశ్వరి దేవికి ఘనంగా ప్రత్యేక పూజలు

నరసన్నపేట: స్థానిక చౌడేశ్వరి ఆలయంలో చౌడేశ్వరీ దేవి జయంతి సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం మంగళ స్నానాలు చేపట్టారు. అనంతరం సుమారు 150 మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వట్టి నాగరాజు, మత్స నిరంజన్, పుచ్చల విశ్వేశ్వరరావు, లింగరాజుస్వామి, వట్టి తాతాజీ తదితరులు పాల్గొన్నారు.


పూజ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రస్థానం హర్షణీయం

కాశీబుగ్గ: తన నటనా చాతుర్యంతో సినీ రంగంలో సినీ నటుడు నందమూరి బాలకృష్ణ 50 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకోవడం హర్షణీయమని బాలకృష్ణ అభిమానులు, టీడీపీ నేతలు అన్నారు. బాలకృష్ణ 50 ఏళ్ల సినీ ప్రస్థానం (గోల్డెన్ జూబ్లీ) పూర్తయిన నేపథ్యంలో ఆదివారం 11వ వార్డులో కేక్ కట్ చేసి సందడి చేశారు. కాశీబుగ్గ టీడీపీ అధ్యక్షుడు లొడగల కామేశ్వరరావు, టీడీపీ నాయ కులు చంద్రశేఖర్‌త్యాడి, సవర రాంబాబు మాట్లాడుతూ.. సినీ నటుడిగా, రాజకీయ నాయకుడిగా, బసవ తారకం కేన్సర్ ఆసుపత్రి ద్వారా సేవలు అందించి అందరి మన్ననలను పొందారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిత్యానంద పండా, సూరి, పొట్నూరు కన్నా, రాము పండా, హరి, ప్రదీప్ పాత్రో, మోహన్ ఆచారి, శ్రీను, బాలాజీ త్యాడి, పలువురు బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తంచేస్తున్న అభిమానులు, టీడీపీ నాయకులు

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

పలాస: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని వక్తలు కోరారు. ఆదివారం పురుషోత్తపురం కాలనీలో సత్యసాయి సేవాదళ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు సప్ప నవీన్, సేవాదళ్ కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరావు, మల్లా రామేశ్వరరావు, మల్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడికి ఐఏఎల్ కమిటీ అభినందన

టెక్కలి: టెక్కలి కోర్టు సముదాయాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏడోసారి గెలిచిన దివ్వల వివేకానందను ఆదివారం విజయవాడలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కమిటీ ప్రతినిధులు సన్మానించారు. న్యాయవృత్తిలో అంకితభావం, అమూల్య మైన సేవలు అభినంద నీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు చంద్ర శేఖరరెడ్డి, సుబ్బారావు, ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ తదితరులు వివేకానందను సన్మానిం చారు. న్యాయవిద్య, బార్‌బెంచ్ సంబం ధాలు, మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంపై దృష్టి సారించాలని వారు కోరారు.


వివేకానందను అభినందిస్తున్న ఐఏఎల్ ప్రతినిధులు

ఉన్నత పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్‌లు ఏర్పాటుచేయాలి

టెక్కలి/నరసన్నపేట: జిల్లాలో అన్ని ఉన్నత పాఠశాలల్లో సైన్స్‌ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలని, ఆంగ్ల, తెలుగు భాషల్లో బోధన కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ జీవశాస్త్ర ఫోరం సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం టెక్కలి, నరసన్నపేట స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఆవరణలో ఆ సంఘ సమావేశం జిల్లా అధ్యక్షుడు పుట్టా ఉదయ్‌కుమార్ ఆధ్వర్యం లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవశాస్త్ర పాఠ్య పుస్తకాల్లో మరింత విస్తృత సమాచారంతో రూపొందించాల న్నారు. జీవశాస్త్ర ఉపాధ్యాయులు సాంకేతి కతను వినియోగించుకొని బోధన చేయాలన్నారు. జన విజ్ఞానవేదిక (జేవీవీ) రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ.. మూఢనమ్మకాలు లేని శాస్త్రీయ సమాజ నిర్మాణం జరగాల న్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు వి.త్రివిక్రమరావు, ప్రమోద్ కుమార్‌పాడి, పూజారి గోవింద రావు, చల్లా రామారావు, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా జనసేన సభ్యత్వ నమోదు

పిన్నింటి పేట(పోలాకి): జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం పిన్నింటి పేట, కోడూరు, గ్రామాల్లో ఆదివారం నిర్వహించారు. నరసన్నపేట నియోజకవర్గ జనసేన పార్టీ బాధ్యుడు మెట్ట వైకుంఠరావు మాట్లాడుతూ.. పార్టీ క్రియాశీలక సభ్యత్వం తీసుకోవడం వల్ల సభ్యుడికి కలిగే ప్రయోజనాలను వివరించారు. మూడురోజుల పాటు నిర్వహించనున్న సభ్యత్వ నమోదు కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.


కోడూరులో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు చేస్తున్న వైకుంఠరావు

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

● ఎమ్మెల్యే గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకువెళ్లా లని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఆదివారం డోకుల పాడులో మాజీ సర్పంచ్ అబంటి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో కూడా కూటమి 90 శాతం విజయం సాధించేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు అందించిన 40 వేల మెజార్టీయే తనకు పెద్ద సన్మానమన్నారు. వైసీపీ పాలనలో కక్షసాధింపుతో టీడీపీ అభిమానుల సంక్షేమ పథకాలు తొలగించారని, కాని కూటమి ప్రభుత్వంలో అటువంటి కక్ష సాధింపులు చేపట్టవద్దని సూచించారు. అర్హులు ఏ పార్టీ వారైనా పథకాలు అందిస్తామన్నారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పథకాలు పొందుతుంటే వారిపై ఫిర్యాదు చేసినట్లయితే విచారణ చేపట్టి సంక్షేమ పథకాలు అందకుండా చూస్తామన్నారు. తీరప్రాంత గ్రామాల్లో బీటీ రోడ్లు నిర్మించాలని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఆమె దృష్టికి తీసుకురాగా నియోజ కవర్గం నుంచి రూ.10 కోట్లతో రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు అందించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడ తామన్నారు. కార్యక్ర మంలో టీడీపీ నాయకులు పుచ్చ ఈశ్వరరావు, కర్ని రమణ, సూరాడ మోహనరావు, అర్సవెళ్లి ఉమామహేశ్వర రావు, నెయ్యి సూర్యనారాయణ, కాస పాపారావు, మద్దు రమేష్, తిమ్మల దుశ్యంత్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు శిరీష అంబికాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

19ఆర్ కాలువ శివారుకు సాగునీరందేనా?

● ఎండిపోతున్న వరి ఎదలు
● పర్లాం, అంధవరం రైతుల ఆందోళన


లింగన్నాయుడుపేట వద్ద గుర్రపుడెక్కతో నిండిన 19 ఆర్ కాలువ


సాగునీరందక ఎండిపోతున్న పర్లాం ప్రాంతంలో వరి ఎదలు

జలుమూరు: ఈ ఏడాదైనా ఖరీఫ్‌కు 19 ఆర్ కాలువ ద్వారా శివారు భూములకు సాగునీరందేనా అన్న అనుమానాలను పర్లాం, అంధవరం, యాతపేట, ఉడకలపేట, రామకృష్ణాపురం గ్రామాల రైతులు వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ పాలనలో ఐదేళ్లుగా ఈ కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో సుమారు 500 ఎకరాలకు సాగునీరందక రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ ఏడాది కూడా ఇప్పటి వరకు పూడికతీత పనులు చేపట్టకపోవడంతో సాగునీరందక వరి ఎదలు ఎండిపోతున్నాయి. 19ఆర్ కాలువ ద్వారా తిమడాం, లింగన్నాయుడుపేట, మాకివలస వరకు సాగునీరు అందుతోంది. అక్కడ రైతులు సహకరించకపోవడంతో శివారు భూములకు సాగునీరు లేక రైతులు తల్లడిల్లుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి శివారు భూములకు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని అంధవరం, రామకృష్ణాపురం, యాతపేట, ఉడకలపేట, పర్లాం ప్రాంతాల రైతులు కోరుతున్నారు.

ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారం నిర్మాణానికి చర్యలు

● అమృత్ భారత్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి నిర్ణయం

పలాస: పలాస రైలు ప్రయాణికుల చిరకాల వాంఛ ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం అభివృద్ధికి రైల్వేశాఖ శ్రీకారం చుట్టింది. అమృత భారత్ రైల్వే స్టేషన్‌గా గుర్తించి, దీనికి గత ఏడాదే కేంద్ర రైల్వే మంత్రిత్వశాఖ రూ.24.50 కోట్ల కేటాయించిన విషయం పాఠకులకు విదితమే. ఈ నిధులతో ప్లాట్‌ఫారాల అభివృద్ధి, రైల్వే స్టేషన్‌లో సిబ్బందికి కార్యాలయాల నిర్మాణాలు, ప్రయాణికుల వసతి గృహాలు, టిక్కెట్ కార్యాలయం ఆధునికీకరణతో పాటు ప్లాట్‌ఫారం-1ను కొత్తగా నిర్మించడం వంటి పనులు చేపట్టాల్సి ఉంది. వారం రోజుల కిందట ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్‌మేనేజర్ (భువనేశ్వర్) పంక్వాల్ పర్యటించి ప్లాట్‌ఫారం నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ప్రస్తుతం పలాస రైల్వే స్టేషన్‌లో 3 ప్లాట్‌ఫారాలున్నా ప్రయాణికులకు అందుబాటులో లేవు. బ్రిడ్జిపై వెయ్యి మీటర్లు నడిచి వెళ్లి ప్లాట్ ఫారంపైకి చేరుకోవాల్సిన పరిస్థితి. డివిజన్‌లో అన్ని రైల్వే స్టేషన్లకు భిన్నంగా పలాస రైల్వే స్టేషన్ ఉండడంతో ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారం రోడ్డువైపు ఉండడమే మేలని రైల్వేశాఖ భావించింది. ఇప్పటికే అనేక సర్వేలు నిర్వహించి ఎట్టకేలకు ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం నిర్మాణాని కి శ్రీకారం చుట్టేందుకు నిర్ణయించారు. ఈ ప్లాట్‌ఫారం పూర్తయితే ప్రయాణికులు టికెట్ తీసుకొని నేరుగా రైలులో ప్రయాణం చేందుకు మార్గం సుగమమవుతుంది.


ఒకటో నెంబరు ప్లాట్‌ఫారం నిర్మించనున్న పాత పార్శిల్ కార్యాలయం ప్రాంతం

ఎస్సీ కులాల వర్గీకరణ దుర్మార్గమైన చర్య

టెక్కలి: ఎస్సీ కులాలను విభజించి పాలించే దుర్బుద్ధితో ప్రభుత్వాలు, సుప్రీం కోర్టు ఏకమై దళితులను ఏ, బీ, సీ, డీ లుగా వర్గీకరించడం దుర్మార్గమైన చర్య అని దళిత సంఘాల నాయకుడు కుప్పిలి కామేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక ఎస్సీ మేనేజ్‌మెంట్ హాస్టల్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీలను విభజించి వారిని బలహీన పరిచి నిర్వీర్యం చేసేందుకే ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారని దుయ్యబట్టారు. సుప్రీంకోర్టు తీర్పును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు టి.సూర్యం, పట్ట పాపా రావు, సామ దామోదరరావు, కూరాకుల యాదవ్, తుంగాన గురుమూర్తి, బోకర బాలకృష్ణ, బోకర చిన్నారావు, హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.


కొవ్వొత్తులతో ప్రదర్శన చేస్తున్న దళిత సంఘాల నేతలు

సుప్రీంకోర్టు తీర్పు పునః సమీక్షించాలి

కోటబొమ్మాళి: షెడ్యూల్డ్ కులాల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టడమేనని, దీనిని దళిత సంఘాలు వ్యతిరేకిస్తున్నాయని మండల దళిత నాయకులు కరజాడ భాస్కరరావు, బోకర జడ్డెన్న, దువ్వారపు సింహాచలం, కూన మల్లేసు, సామ సంజీవ రావు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. శాసనసభలు, పార్లమెంట్, గవర్నర్, రాష్ట్రపతి ఆమోదించిన చట్టాలు చేయాలి తప్ప న్యాయమూర్తులు వర్గీకరణ చేయాలని ప్రకటించడం సరికాదన్నారు. సుప్రీంకోర్టు తీర్పును పునఃపరిశీలించాలని కోరారు.

తుప్పల్లో జనరేటర్

పలాసరూరల్: పలాస తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న పాత తహసీల్దార్ భవనాల వద్ద తుప్పల్లో జనరేటర్ వృథాగా పడి ఉంది. లక్షల వ్యయంతో జనరేటర్ మంజూరు చేస్తే దీనిని వినియోగించకుండా వదిలేయడంతో చుట్టూ మొక్కలు పెరగడంతో పాటు పాడవు తోంది. కనీసం మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి జనరేటర్‌ను బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలి

వజ్రపుకొత్తూరు: ఐక్యంగా ఉండి సమస్యలు పరిష్కరించుకోవాలని వజ్రపుకొత్తూరు శ్రీకంచి కామాక్షి విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు లక్కోజు ధర్మారావు అన్నారు. ఆదివారం కంచికామాక్షి ఆలయ సన్నిధానంలో సంఘ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వచ్చేనెలలో జరగనున్న విశ్వకర్మ, కంచి కామాక్షి పూజలు ఘనంగా చేయాలని నిర్ణయించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కంజుమోజు కేశవరావు, కొత్తూర్తి జగ్గారావు, బూరగాపు చింతామణి, భాస్కరరావు, లక్కోజు ప్రసాద రావు, వి.రమణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ధర్మారావు

బీచ్‌లో ఆకతాయిల హల్‌చల్

వజ్రపుకొత్తూరు: ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆదివారం కొందరు ఆకతాయిలు మద్యం సేవించి బీచ్‌లో హల్‌చల్ చేశారు. ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి, పలాసకు చెందిన నలుగురు యువకులు మద్యం సేవించి సముద్ర స్నానాలకు వెళ్లి అలల్లో చిక్కుకున్నారు. ఆదివారం అమావాస్య కావడంతో సముద్రంలో అలలు తీవ్రంగా వస్తున్నాయి. మద్యం సేవించిన ఆకతాయిలు వాటిలో చిక్కుకోవడంతో స్థానికులు గమనించి వారిని రక్షించే చర్యలు చేపట్టారు ఒక సమయంలో వారు గల్లంతైనట్లు అనుకున్నప్పటికీ మత్స్యకారుల సాయంతో ప్రాణాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్ రామారావు శివసాగర్ బీచ్‌కు చేరుకొని ఆకతాయిల పని పట్టారు. సముద్రంలోకి ఏ ఒక్కరూ దిగకుండా బందోబస్తు నిర్వహించారు.


శివసాగర్‌తీరంలో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ రామారావు, సిబ్బంది

బాధిత కుటుంబానికి దువ్వాడ శ్రీధర్ పరామర్శ

పలాసరూరల్: పలాస వ్యవసాయ సలహా సంఘం కమిటీ మాజీ చైర్మన్ గొర్లె వేణుగోపాల్‌ను పీఏసీఎస్ మాజీ చైర్మన్, షిర్డీసాయి సంస్థాన్ ట్రస్టు చైర్మన్ దువ్వాడ శ్రీధర్ ఆదివారం పరామర్శించారు. వేణుగోపాల్ తల్లి పద్మావతి ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని రాజగో పాలపురంలో కలిసి పరామర్శించి ఓదార్చారు. పరామర్శించిన వారిలో కూన హేమాచలం, దువ్వాడ కామేశ్వరరావు, టి.శ్రీనివాస్, పినకాన తిరుమలరావు, లఖినాన విశ్వనాథం, కంచరాన జగన్, కాళీమాస్టారు, శశిభూషణ్ ఉన్నారు.


వేణుగోపాల్‌ను పరామర్శిస్తున్న దువ్వాడ శ్రీధర్

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత స్థానం

కాశీబుగ్గ: కేంద్రప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన 2024-25 బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత స్థానం ఇచ్చి నిధులు కేటాయించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రధాని మోదీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుం టుందని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్రమే పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి మంద కృష్ణ మాదిగకు ప్రధాని ఇచ్చిన మాటకు కట్టుబడి సుప్రీంకోర్టులో తీర్పు వచ్చేలా మోదీ అహర్నిశలు శ్రమించారన్నారు. అంతకుముందు నెహ్రూ పార్కులో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు వైశ్యరాజు మోహన్‌రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలవలస వైకుంఠరావు, రాజరత్నం పాల్గొన్నారు.

యూవీవీ ఆధ్వర్యంలో ఐఐటీ కోర్సుపై శిక్షణ

పలాసరూరల్: నీలావతి గ్రామంలో ఉద్దానం విద్యాభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు ఐఐటీ కోర్సులపై ఆదివారం శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదిక సభ్యులు ఐఐటీ ఫౌండేషన్ కోర్సు ఆవశ్యకత, భవిష్యత్‌లో ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో యూవీవీ గౌరవ అధ్యక్షుడు కుత్తుమ ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి ప్రకాశరావు, సభ్యులు గొరకల లోకేశ్వర రావు, పోతనపల్లి గీతమ్మ, జినగ సీతారాం పాల్గొన్నారు.

నేడు భవిత కేంద్రంలో న్యాయవిజ్ఞాన సదస్సు

టెక్కలి: స్థానిక భవిత కేంద్రంలో సోమవారం న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించనున్నట్లు జూని యర్ సివిల్‌న్యాయాధికారి తేజాచక్రవర్తి తెలిపారు. మానసిక అనారో గ్యం, మానసిక దివ్యాంగులకు న్యాయసేవాధికార సంస్థలు అందిస్తున్న సేవలపై ఈ అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు హాజరవుతారని తెలిపారు.

జెండాను ఎగురవేయాలి

కోటబొమ్మాళి: 'హర్‌ఘర్ తిరంగా' ప్రచారంలో భాగంగా ఈనెల 9 నుంచి 15వ తేదీ వరకు ఇళ్లపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హర్‌ఘర్ తిరంగా ప్రచారం రెండేళ్లలో జాతీయ ఉద్యమంగా మారిందన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

టెక్కలి: నర్సింగపల్లి పంచాయతీ కిట్టాలపాడు గ్రామానికి చెందిన మోద నాగవేణి(42) శనివారం గడ్డిమందు తాగి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తన ఫోన్‌కు వచ్చిన అసభ్య మెసేజ్‌ల నేపథ్యంలో భర్త నారాయణరావుతో తగాదా పడి గడ్డిమందు తాగింది. హుటాహుటిన ఆమెను టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఈ మేరకు కుమార్తె శ్రీదేవి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొట్లాటపై కేసు నమోదు

నందిగాం: సైలాడ పంచాయతీ దేవాడలో భూమి విషయమై జరిగిన కొట్లాటపై కేసు నమోదైంది. నందిగాం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన లండ ధర్మారావుకు 11 సెంట్ల భూమి ఉంది. ఆ పక్కన లండ నాగరాజు, రామారావులకు చెందిన భూమి ఉంది. ఈ భూమిని ధర్మారావు కలిపేస్తున్నాడని రామారావు ఆదివారం ఉదయం గొడవకు దిగాడు. ఇది కొట్లాటకు దారి తీసింది. ఈ ఘటనలో తనను, తన కుమారుడిని నాగరాజు, రామారావు గాయపరి చారని ధర్మారావు పోలీసు లకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహ్మద్ అమీర్‌ఆలీ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎచ్చెర్ల: కుశాలపురంలో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. వీరి నుంచి రూ.36,400, మూడు ద్విచక్ర వాహనాలు, మూడు మొబైల్స్ సాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఆదిత్యునికి వెండి పూజా సామగ్రి అందజేత


వెండి పూజా సామగ్రిని ఈవోకి అందిస్తున్న భక్తులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని ఆదివారం విశాఖకి చెందిన ఎన్.శ్రీమన్నారాయణ దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి వెండి ఉద్ధరిణి, వెండి పంచపాత్ర, వెండి పళ్లెం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.చంద్రశేఖర్‌కు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించగా, స్వామివారి జ్ఞాపికను ఆలయ ఈవో వారికి అందజేశారు. ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆదిత్యాలయ అనివెట్టి మండపంలో జీఎల్ పురం గ్రామానికి చెందిన రామలింగేశ్వర కోలాట బృందం వారిచే కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కాగా ఆదివారం ఒక్కరోజు స్వామివారికి రూ.2,06,595 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.36,600లు, విరాళాల ద్వారా రూ.53,850, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,16,145 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు.

నీరజ శిష్యులకు నర్తనబాల జాతీయ అవార్డు


పురస్కారాలతో నృత్యకారిణులు

శ్రీకాకుళం కల్చరల్: అభినయ నృత్యభారతి ఏలూరుకి చెందిన శాస్త్రీయ నృత్యంలో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన వారికి నర్తనబాల జాతీయ పురస్కారాలు 2024 ప్రదానం చేశారు. డి.విశిష్ట, డి.తనూష, పి.జోషిత కూచిపూడిలో ప్రతిభను కనబరిచారు. దీంతో వీరికి నర్తనబాల-2024 పురస్కారాలు, నృత్యదర్శకురాలు నీరజ సుబ్రహ్మణ్యానికి అభినందన సత్కారంతో గౌరవించారు. ఈ అవార్డులను మానవతా స్టేట్ కోఆర్డినేటర్ అడుసుమిల్లి నిర్మలాదేవి, హేలాపురి బాలోత్సవ్, కన్వీనర్ గుడిపాటి నరసింహారావు, లయన్స్ వైస్ గవర్నర్ డి.సుబ్బారావు, రోటరీ వైస్ గవర్నర్ లలితా శర్మ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డి.హేమసుందర్ తదితరులు చేతుల మీదుగా ప్రదానం చేసారు. ఈ కార్యక్రమం ఏలూరు రోటరీ క్లబ్ భవనంలో జరిగింది.

మెగా మెడికల్ క్యాంప్‌నకు స్పందన

ఇచ్ఛాపురం: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా డెంటల్ అండ్ ఆయుర్వేదిక్ మెడికల్ క్యాంపునకు విశేష స్పందన లభించింది. ఆదివారం నిర్వహించిన మెడికల్ క్యాంప్‌లో 200మంది ఆయుర్వేదిక్, 100 మంది డెంటల్ పరీక్షలు జరిపారు. అనంతరం రూ.60వేలు విలువ గల ఉచితంగా మందులు అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు పి.దినేష్, నవీన్‌కుమార్, రోహిత్, పాక దాసు, డాక్టర్ వేదవ్యాస్, వీకే ప్రసాద్, నవీన్ చౌదరి, సురేష్, ప్రదీప్, గోపి చౌదరి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ అధ్యాపకుల పాదయాత్ర


కూర్మనాథుని సన్నిధిలో ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు

ఎచ్చెర్ల: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు పర్యావరణ పరిరక్షణకై ఆదివారం క్యాంపస్ నుంచి శ్రీకూర్మం వరకు పాదయాత్ర చేశారు. ప్లాస్టిక్ వినియోగం నివారించాలని, మొక్కలు నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నినాదాలతో పాటు దారిపొడవునా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం శ్రీకూర్మనాథుని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు ఎం.సతీష్, పి.సోమేశ్వరరావు, సీహెచ్ పోలిరాజు, ఎల్.చంద్రశేఖర్, కె.రామ్మోహన్, వి.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే స్థాయి ఎవరికీ లేదు


సమావేశంలో మాట్లాడుతున్న మొదలవలస రమేష్

ఆమదాలవలస: ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించే స్థాయి ఎవరికీ లేదని జిల్లా పార్లమెంటరీ టీడీపీ కార్యాలయ కార్యదర్శి మొదలవలస రమేష్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు కనుసన్నల్లోనే ఇసుక దోపిడీ అంటూ వైసీపీ నాయకుడు చింతాడ రవికుమార్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. విషయం తెలియకుండా మాట్లాడడం ఇకనైనా మానుకోవాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా దాచుకో దాచుకో వంటి వ్యవహారాలు జరగవన్న స సంగతి గుర్తుపెట్టుకోవాలన్నారు. నారాయణపురం ఆనకట్టు ఆధునికీకరణకు గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో జైకా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించిందని, ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం వచ్చి ఆ పనులను నిలిపివేసిందన్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాగావళి నది పక్కన కాఖండ్యాం దగ్గర జీవో ఎంఎస్ నెంబర్-43 పేరిట జీవో విడుదల చేసిందన్నారు. జేసీ ఎంటర్ ప్రైజెస్ అనే సంస్థ వైసీపీ ప్రభుత్వ హయాంలోనే 2026 వరకు లైసెన్స్ తీసుకున్నారన్నారు. రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి బోర గోవిందరావు మాట్లాడుతూ.. గత వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఇష్టారీతిన ఇసుకను తరలించినప్పుడు చింతాడ రవికుమార్ ఎక్కడ నిద్రపోయారన్నారు. ఇప్పటికైనా తప్పుడు ప్రకటనలు మానుకోవాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూక రాజు, బొడ్డేపల్లి గౌరీపతి, అన్నెపు భాస్కరరావు, వండాన ఉదయ్‌కుమార్, సదాశివుని వెంకటేశ్వరరావు, ఎండ అప్పలనాయుడు, తమ్మినేని అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతా శివనామ స్మరణే

- నేటి నుంచి శ్రావణ మాసం
- బోల్‌భం దీక్షలకు సన్నద్ధం
- మాలలు ధరించనున్న వేలాది మంది శివభక్తులు


బోల్‌భం దీక్షలో ఉన్న భక్తులు (ఫైల్)

(కంచిలి)

పరమశివుడికి ప్రీతికరమైన శ్రావణమాసంలో శివమాలలు ధరించి, పవిత్ర నదీజలాలతో స్నానమాచరించి, ఆ నది నీటితో పరమశివుడి ప్రతిరూపమైన శివలింగాన్ని అభిషేకిస్తే మనసులోని కోరికలన్నీ నెరవేరుతాయని ఈ ప్రాంత భక్తుల విశ్వాసం. ఈ ఏడాది శ్రావణమాసం ప్రారంభమైన తొలి సోమవారమే శివమాలలు ధరించి, దీక్షలు చేపడతారు. ఈ దీక్షలకు బోల్‌భం దీక్షలుగా భక్తులు విశ్వసిస్తారు. ప్రతీ ఏటా వేలాది మంది భక్తులు ఈ మాలలు ధరించి పరిసర ప్రాంతాల్లో భక్తి ప్రవృత్తులను పెంపొందిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆ శివభక్తులు, వారి దీక్షలపై ప్రత్యేక కథనం.

బోల్‌భం దీక్షలు ఉత్తరాది రాష్ట్రాలతో పాటు, ఉత్కళాంధ్రలో భక్తులు విశ్వసించి ఆచరిస్తున్నారు. స్థానికంగా కొంతమంది భక్తులు శివమాలలు ధరించి ఒకచోట పూజలు చేస్తారు. సంక్రమణం, ప్రత్యేక రోజుల్లో శివమాలలు ధరించిన స్వాములంతా తమ సమీపంలోని పవిత్ర నదుల్లో స్నానాలాచరించి కావళ్లతో ఆ నీటిని తీసుకువస్తారు. నది నుంచి కాలినడకతో సుదూరంలో ఉండే శివాలయానికి నడచి వెళ్లి ఆ నీటితో శివునికి అభిషేకం చేస్తారు. మిగిలిన రోజుల్లో సన్నిధానంలో ప్రతిరోజు ప్రత్యేక పూజలు, భజనలు చేస్తారు. శ్రావణమాసం పూర్తయిన తర్వాత స్వాములు చాలా మంది శివునికి చెందిన ప్రముఖ పుణ్యక్షేత్రాలకు వెళ్లి తమ దీక్షలను విరమిస్తారు. ఇలా శ్రావణమాసం మొత్తం భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తే తమ కోరుకున్న కోరికలు నెరవేరడమే కాకుండా లోక కల్యాణం జరుగుతుందని భక్తుల విశ్వాసం.

ఒడిసా నుంచి ఆంధ్రకు..

బోల్‌భం దీక్షలు ఒడిసా ప్రాంతంలో ఎక్కువగా ఆచరిస్తున్నా ఐదారేళ్ల నుంచి ఆ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోను ఎక్కువ మంది భక్తులు ఈ దీక్షలు ఆచరిస్తున్నారు. బోల్‌భం దీక్షల చేపట్టి శివభక్తుల వేషధారణ, దుస్తులతో పాటు వారి ఆహార నియమాలన్నీ ప్రత్యేకంగా ఉంటాయి. పూర్తిగా కాషాయ వస్త్రాలు దరించి, ముఖానికి, చేతులకు, కాళ్లకు విభూతి పూసుకుంటారు. మెడలో రుద్రాక్షలు ధరించడం, చేతిలో త్రిశూలం పట్టుకుని ఆ పరమశివుడి రూపంలో కనిపిస్తారు. పూర్తిగా సాత్విక ఆహారమే తీసుకుంటారు.

కోర్కెలు తీరుతాయని విశ్వాసం

బోల్‌భం మాలలు వేస్తే కోరిన కోర్కెలు తీరుతాయని నమ్మకంతో మాలలు వేస్తున్నాం. మేము భావించినట్టే మా కోర్కెలు తీరుతున్నాయి. అందువల్ల ఐదేళ్లగా ఈ దీక్షలు ఆచరిస్తున్నాను.

\- సంతోష్ సాహు

ప్రతి ఏడాది ఆచరిస్తున్నా..

ప్రతీ ఏడాది దీక్షలు ఆచరిస్తున్నా. శివునికి ఎంతో ప్రీతిపాత్రమైన ఈ శ్రావణమాసంలో దీక్షలు చేస్తుండడం ఎంతో ఆనందంగా ఉంది. ఆహార నియమాల వల్ల ఆరోగ్యం కూడా బాగుటుంది.

\- కాశీ బెహరా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: పర్యావరణ పరిరక్షలో ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని మెట్టక్కివలస శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రేమ తరు మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక అర్బన్ ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఎమ్మెల్యే రవికుమార్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో మొక్కల నాటి, సంరక్షించకపోవడంతో కోట్ల రూపాయలు వృథా చేశారన్నారు. ప్రధాని మోదీ ఈ మొక్కల పెంపకం బాధత్య సత్యసాయి సమితికి అప్పగించడం అభినందనీయమన్నారు. సత్యసాయి జిల్లా సంఘ అధ్యక్షుడు సూరు రామచంద్రరావు, వైద్యులు విజయ కుమారి, సమితి ప్రతినిధులు డాక్టర్ పి.తాతయ్యలు, ఎం.రవీంద్రబాబు, కె.ప్రహ్లాద రావు, జనార్దన్, అవధానులు అన్నెపు సత్యనారాయణ, గజపతిరావు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నపం


ఎమ్మెల్యే శంకర్‌ను సత్కరిస్తున్న అరసవల్లి ప్రజలు

అరసవల్లి: అరసవల్లి గ్రామంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సుమారు 300 మంది నగర బీసీ అధ్యక్షుడు ఉంగటి వెంకటరమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గొండు శంకర్‌కు విన్నవించారు. ఈ మేరకు ఆదివారం కిష్టప్పేటలోని ఆయన స్వగృహంలో కలుసుకున్నారు. అంగన్వాడీ భవనాలు, డ్వాక్రా మహిళలకు సమావేశ మందిరం, సచివాలయం భవనం, శ్మశానవాటికలో దీపాలు, ప్రహరీ, షెడ్లు, వాటర్ సదుపాయం, సులబ్ కాంపెక్స్ తదితర సమస్యలు వివరించారు. దీనిపై ఎమ్మెల్యే శంకర్ స్పందించి వెంటనే నగర కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో శిమ్మ వెంకటరావు, ఉంగటి పాపారావు, గోవిందు, దొరరాజు, చిన్నారావు, బాలయ్య, సంతోష్, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక


ఎంపిక పోటీలను ప్రారంభిస్తున్న అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో జయకేతనం ఎగురవేయాలని జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కన్వీనర్ కలిదిండి వెంకటరామరాజు పిలుపునిచ్చారు. జిల్లాస్థాయి జూనియర్స్, సబ్ జూనియర్స్ బాలబాలికల సాఫ్ట్‌బాల్ ఎంపికల పోటీలు ఆదివారం స్థానిక ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సీజ్‌లో మొట్టమొదటి రాష్ట్రస్థాయి పోటీలు శ్రీకాకుళంలో ఆరంభం కావడంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోనున్నట్టు తెలిపారు. కాగా జిల్లా నలుమూలల నుంచి సుమారు 160 మంది క్రీడాకారులు ఈ ఎంపికల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి ఎం.సాంబమూర్తి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బీవీ రమణ, సాఫ్ట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు మెట్ట తిరుపతిరావు, బొడ్డేపల్లి సరేష్‌కుమార్, ఎం.ఆనంద్ కిరణ్, అన్నెపు రాజగోపాల్, గురుగుబెల్లి రాజశేఖర్, ఎ.డిల్లేశ్వరరావు, మహంతి, సతీష్‌రాయుడు, మల్లేశ్వరరావు, తోటారావు, పెంటయ్య, మధుసూధన్ తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి శిక్షణ శిబిరాలు

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులకు ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి మొజ్జాడ వెంకటరమణ అన్నారు. శ్రీకాకుళం అతిథ్యంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలు కావడం జిల్లా జట్టు గెలుపే లక్ష్యంగా తర్ఫీదు ఇవ్వనున్నట్టు తెలిపారు. వారికి అవసరమైన భోజన, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. కేశవరావుపేట జడ్పీ హైస్కూల్‌లో బాలురకు, ఇప్పిలి జడ్పీ హెచ్ఎస్‌లో బాలికలకు శిక్షణ శిబిరాలు ఉంటాయన్నారు.

కళాకారులను ప్రోత్సహించాలి

రణస్థలం: మరుగున పడుతున్న కళలను, కళాకారులను ప్రోత్సహించాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఉత్తరాంధ్ర స్థాయిలో ఏకపాత్రాభినయ పోటీలు బాపూజీ కళామందిర్‌లో ఆదివారం రాత్రి జరిగాయి. ఇందులో 30 మంది కళాకారులు పాల్గొనగా ఆరుగురు ఎంపికయ్యారు. అందులో రణస్థలం మండల కేంద్రానికి చెందిన బోనం గుర్నమూర్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి మహాత్యంలో అరద్వీజుడు ఏకపాత్ర ప్రత్యేక అవార్డుని పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలం, ఎమ్మెల్యే గొండు శంకర్ చేతులు మీదుగా అందచేశారు. సినీ సంగీత దర్శకులు లీలామోహన్, రాజబాబు, శ్రీకాకుళం జిల్లా కళాకారుల సంఘ అధ్యక్షుడు చిట్టి వెంకటరావు, ప్రతినిధులు రామస్వామి నర్సింహమూర్తి పాల్గొన్నారు.

మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలి



మాట్లాడుతున్న జనార్దనరావు

ఆమదాలవలస: పెన్షనర్లకు మధ్యంతర భృతి 30 శాతం ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పెన్షనర్ల సంఘ ప్రధాన కార్యదర్శి బొడ్డేపల్లి జనార్దనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని లక్ష్మీనగర్, మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ధాస్యం లక్ష్మణరావు అధ్యక్షతన ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 12వ పీఆర్సీ నియమించి ఏడాది దాటిపో యిందని, ఇంతవరకు మధ్యంతర భృతి ప్రకటించకపోవడం దారుణమన్నారు. తక్షణమే 30 శాతంతో ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు బొడ్డేపల్లి మోహన్‌రావు మాట్లాడుతూ.. ఐపీసీ సెక్షన్ల మార్పు ప్రజాస్వామ్య వ్యవస్థకు గొడ్డలిపెట్టు అన్నారు. అనంతరం సంఘ కోశాధికారి హెచ్‌వీ సత్యనారాయణ ఆర్థిక నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ నాయకులు ఎన్.చంద్రశేఖరరావు, ఆర్.సత్యనారాయణ, కె.షన్ముఖరావు, బెండి సూర్యనారాయణ, పీవీఎన్ మాస్టార్, పి.భానోజీరావు, బెండి నారాయణరావు, కె.సంజీవరావు, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల స్థితిగతులపై ప్రభుత్వానికి నివేదిస్తాం

అరసవల్లి: రాష్ట్రంలోని వివిధ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా శాఖల ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. ఆదివారం స్థానిక బలగలో గల గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, బీసీ సంక్షేమ హాస్టళ్లను సీతారాం ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో భేటీ అయ్యారు. మెనూ అమలవుతున్న తీరును, పదార్థాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ.. గ్రామ, మండల, పట్టణ ప్రాంతాల్లోని అన్ని ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నామన్నారు. గిరిజన సంక్షేమాధికారి ఎం.శ్రీనివాసరావు, బలల సంరక్షణాధికారి రమణ, జనార్దన్, అనురాధ, కృష్ణవేణి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

శంకర్ చెరువును అభివృద్ధి చేస్తా


స్నేహితులతో కలిసి చెరువును పరిశీలిస్తున్న ఎంపీ కలిశెట్టి

రణస్థలం: మండల కేంద్రంలోని శంకర్ చెరువును అన్నీ విధాల అభివృద్ధి చేస్తానని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ఆదివారం శంకర్ చెరువును ఆయన తన స్నేహితు లతో కలిసి శంకర్ చెరువును పరిశీలించారు. శంకర్ చెరువు పనులను పూర్తి చేసి పార్కును ఏర్పాటు చేస్తానన్నారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మా ట్లాడి చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎంపీతోపాటు తన స్నేహితులు ఎం.శ్రీనివాసరావు, పిన్నింటి సత్యన్నాయుడు, పచ్చిగుళ్ల సాయిరాం, దమ్ము శ్రీను తదితరులు ఉన్నారు.

కుల గుర్తింపునకు కార్యాచరణ ప్రణాళిక


సమావేశమైన బెంతు ఒరియా సంఘ ప్రతినిధులు

కవిటి: బెంతు ఒరియా కులగుర్తింపు కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగుతామని ఆ కుల పెద్దలు నిర్ణయించారు. కుసుంపురం గ్రామంలో ఆదివారం కులపెద్దలు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బి.అశోక్‌కు వినతిపత్రాన్ని ఇచ్చి సమస్య పరిష్కారంపై మాట్లాడాలని నిర్ణయించారు. కవిటిలో నిరాహార దీక్ష చేపడుతున్న విషయం పైనా చర్చించారు. సంఘ గౌరవాధ్యక్షుడు శ్యాంపురియా మృతికి సంతాపం తెలిపారు. దేవరాజుసాహు, రజనీకుమార్ దొళాయి, హరికృష్ణ బిసాయి, కేశవపురియాలు పాల్గొన్నారు.

సృష్టిలో తీయనైనది స్నేహం


స్నేహితులంతా సందడి చేస్తున్న దృశ్యం

అరసవల్లి: సృష్టిలో తీయనిది స్నేహమేనోయ్... అనుకుంటూ వారందరూ ఆదివారం ఉదయం నగరంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో కలుసుకున్నారు. అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. స్టార్ వాకర్స్ క్లబ్, ఇండియన్ సొసైటీ ఫర్ కల్చరల్ కోపరేషన్ అండ్ ఫ్రెండ్‌షిప్‌తో కలిసి స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకున్నారు. కార్యక్రమంలో పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు, జి.ఇందిరాప్రసాద్, బీవీ రవిశంకర్, సత్యనారాయణ, పీజీ గుప్తా, ఎం.వాసుదేవాచారి, సూర్యారావు, మల్లిబాబు, సింహాద్రి వేణుగోపాల్ పాల్గొన్నారు.

చౌడేశ్వరి అమ్మవారికి పూజలు

ఇచ్ఛాపురం: స్థానిక దేవాంగుల కులస్థులు రామలింగేశ్వర ఆలయంలో చౌడేశ్వరి అమ్మవారి పూజలు ఆదివారం ఘనంగా జరిపారు. అమ్మవారికి అర్చన, కుంకుమ పూజలు, హోమాలు, జరిపారు. పూజా కార్యక్రమంలో వందలాది మహిళలు పాల్గొని పూజలు జరిపారు.

తులసమ్మ సంబరం

ఇచ్ఛాపురం: ధనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని మండల పరిధిలో గల పలు గ్రామాల ప్రజలతో పాటు పట్టణానికి చెందిన ప్రజలు ఘనంగా జరి పారు ఆదివారం మహిళలు అమ్మవారి ఘటాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

● **సోంపేట:** దేవాంగుల ఆరాధ్య దేవత చౌడేశ్వరి అమ్మవారి వేడుకలు సోంపేట పట్టణంలోని చౌడేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, నామ సంకీర్తన, ఊరేగింపులో ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన చేపట్టారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం, యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


ఇచ్ఛాపురం: కుంకుమ పూజల్లో మహిళలు


సోంపేట: చౌడేశ్వరి అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న ప్రజలు

విషాదం మిగిల్చిన విహారం

- గంభీరం రిజర్వాయర్‌లో పడి విద్యార్థి మృతి
- స్నేహితుల దినోత్సవం రోజున విషాదం


నిరంజన్ (ఫైల్)

ఆనందపురం, ఆగస్టు 4: స్నేహితుల దినోత్సవం రోజున విషాదం నెలకొంది. సరదాగా గడిపేందుకు గంభీరం రిజర్వాయర్ వద్దకు వెళ్లిన ముగ్గురు మిత్రుల్లో ఒకరు ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన జోకి నిరంజన్ (20), విశాఖకు చెందిన జె.యశ్వంత్, బి.ఆశిష్, హైదరాబాద్‌కు చెందిన రెహన్, తాడేపల్లిగూడేనికి చెంది న లలిత్ విశాఖలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంజనీరింగ్ చదువుతున్నారు. స్నేహితుల దినోత్సవం కావడంతో సరదాగా గడిపేందుకు ఆదివారం సాయంత్రం గంభీరం రిజర్వాయర్‌కు చేరుకున్నారు. సరదాగా గడుపుతుండగా జోకి నిరంజన్ సెల్ఫీ తీయడానికి ప్రయత్నించి కాలుజారి రిజర్వాయర్‌లో పడిపోయాడు. అతడిని రక్షించేందుకు జె.యశ్వంత్, బి.ఆశిష్ దూకారు. అయితే ముగ్గురికీ సరిగా ఈత రాకపోవడంతో నీట మునిగిపోతుండగా, స్థానికులు గమనించి రిజర్వాయర్‌లోకి దూకి కాపాడే ప్రయత్నం చేశారు. అయితే యశ్వంత్, ఆశిష్‌లను సురక్షితంగా బయటకు తీసినా, నిరంజన్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ బలగాల సాయంతో గాలింపు చర్యలు చేపట్టి, మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ఆస్పత్రికి తరలించి సీఐ తిరుమలరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతదే కీలక బాధ్యత

శ్రీకాకుళం కల్చరల్: తెలుగుదనానికి పేరొందిన కరుణశ్రీ వంటి సహజ కవులను తలచుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని పలువురు వక్తలు అన్నారు. జీవించినంత కాలం కవిత్వం రాసి, రాసినంత కాలమే జీవించిన ఆయన జయంతి ఉత్సవ సభను శ్రీకాకుళం తెలుగు రచయితల వేదిక ఆదివారం నిర్వహించింది. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాల ఆవరణలో తెరవే గౌరవ సలహాదారు సురంగి మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జంధ్యాల శరత్‌బాబు ముఖ్యవక్తగా మాట్లాడారు. పద్య, గద్య, రచన పరంపరతో పాఠకులను అలరించిన జంధ్యాల పాపయ్య శాస్త్రి సాహితీ మూర్తిమత్వాన్ని ఉదాహరణలతో వివరించారు. సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తి నిర్వహణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కవులు కోమలరావు, ముంగిపూడి శ్రీనివాసరావు ఇద్ది పాపయ్య, నిక్కు హరి సత్యనారాయణ, ఐఎస్‌డీ ప్రసాద్, ముట్నూరి ఉపేంద్ర శర్మ, వి.రాజారావు, పూడి జనార్దనరావు, తంగి ఎర్రమ్మ, లలితారెడ్డి తమ అభిప్రాయాలు తెలిపారు. ముఖ్య వక్త శరత్‌బాబును సభలో సత్కరించారు.

డిప్యూటీ సీఎం దృష్టికి సమస్యలు

ఇచ్ఛాపురం: సహర బాధితుల సమస్యలు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సహర కస్టమర్స్ అండ్ ఫీల్డ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజుకు కోరారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లా రీజన్ పరిధిలో రూ.500 కోట్లు సహారా సంస్థ చెల్లించాల్సి ఉందన్నారు. సీఆర్‌సీఎస్ పోర్టర్ ద్వారా ప్రతీ ఖాతాదరుడుకి సొమ్ము జమ చేస్తామని అప్పటి కేంద్ర మంత్రి అమీత్‌షా 2023లో హామీ ఇచ్చారన్నారు. ఇంత వరకు 5శాతం కూడా చెల్లింపులు జరగలేదని తెలిపారు. చెల్లింపులు కాకపోవటంతో సహారా ఏజెంట్లు, కస్టమర్లు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ సభ్యులు మాదవరావు, సుందరరావు, దుదిష్టి పండా తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

కంచిలి: కర్తలి గ్రామానికి చెందిన పైల రిషీకేష్ కుటుంబ సభ్యులకు జాడుపూడి కాళీదుర్గామాత సేవా సంస్థ సభ్యులు రూ.310000 సాయం ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ.. కర్తలి గ్రామానికి చెందిన పైల తాతయ్య, ధనలక్ష్మి కుమారుడు పైల రిషీకేష్ బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నట్లు తెలిసిందన్నారు. రెండున్నరేళ్ల రిషీకేష్ వైద్యానికి సుమారు రూ.25లక్షలు అవసరమన్నారు. వైద్య ఖర్చులు నిమిత్తం గ్రామానికి చెందిన సంస్థ సభ్యులు పిలక చినబాబురెడ్డి, పైల జయరాం రెడ్డి తదితరులు సేవా సంస్థ తరుపున విరాళాలు సేకరించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. వీరికి గ్రామస్థులు అభినందించారు.

వ్యాధిగ్రస్తునికి స్నేహితులు సాయం

కవిటి: స్నేహితుల దినోత్సవం సందర్భంగా కవిటి ఉషోదయ యువజన సంఘానికి చెందిన వారంతా కలసి కవిటి కొత్తూరు గ్రామానికి చెందిన రామిశెట్టి డొంబురు అనే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తునికి ఆదివారం సాయాన్ని అందించారు. కవిటిలోని ఉషోదయ భవనం వద్ద జరిగినలో డొంబురుకు రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో పి.శేఖర్, ఎ.మదు,బి.రమేష్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మహాధారణ అవధానం

శ్రీకాకుళం కల్చరల్ ఉపనిషన్మందిరం సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కోదండరామాలయం ప్రాంగణంలో పోతన భాగవతం, దశమ స్కంధ పూర్వ భాగంపై మహాధారణ అవధానం నిర్వహించారు. విశాఖకు చెందిన ఓరుగంటి రాజరాజేశ్వరి ప్రసాద్‌చే మహాధారణ అవధానం జరిగింది. అధ్యక్షుడు గుమ్మా నగేష్, పులకండం శ్రీనివాసరావు, నిష్టల నర్సింహమూర్తి, మంగిపొడి శ్రీనివాసరావు, కామేశ్వరరావు, పతంజలి శాస్త్రి, మందుల మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘంలోకి పలువురు

ఆమదాలవలస: ఎమ్మెల్యే కూన రవికుమార్ సమక్షంలో వైసీపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ నుంచి సుమారు 20మంది విద్యుత్ ఉద్యోగులు తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘంలో ఆదివారం చేరారు. వీరికి కండువా వేసి ఎమ్మెల్యే ఆహ్వానించారు. ఈ చేరికల్లో విద్యుత్ ఉద్యోగులు కాకర్ల శ్రీనివాసరావు, సనపల రామారావు, తామాడ అప్పన్న, గొద్దు గోపి, రెడ్డి వాసుదేవరావు తదితరులు ఉ ఉన్నారు. రీజనల్ అధ్యక్షుడు జీవీ రమణమూర్తి, కార్యదర్శి వైకుంఠరావు తదితరులున్నారు.

రూ.25 వేలు అందజేత

ఆమదాలవలస: అక్కివరం గ్రామానికి చెందిన కానిస్టేబుల్ జి.విద్యాసాగర్ తిరుపతి జిల్లా వైవీ పాలెం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆదివారం ఉదయం ఆయన భౌతికకాయాన్ని అక్కివరం గ్రామానికి తీసుకొచ్చారు. తిరుపతి జిల్లా పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు సోమ శేఖరరెడ్డి అభ్యర్థన మేరకు జిల్లా పోలీస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.కృష్ణంనాయుడు, కార్యవర్గ సభ్యులు కె.భుజంగరావు, నర్సింహులు, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, విద్యాసాగర్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అతడి తల్లి జనార్దనమ్మకు తక్షణ సాయంగా రూ.25 వేలు అందించారు. శ్రీకాకుళం టూటౌన్ హెచ్‌సీ సత్యనారాయణ, పోలీస్‌కానిస్టేబుళ్ల తదితరులు పాల్గొన్నారు.